



వ్యవసాయ సర్వే చేయలేమంటూ కందిలో ఎంపీడీవోకు వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

బాబోయ్.. దొంగలు

సంగారెడ్డి జిల్లాలో వరుస చోరీలు

- భయాందోళనలో ప్రజలు
- సీసీ కెమెరాల్లో చోరీల ఘటనలు రికార్డు
- ఆధారాలున్నా పట్టుకోని పోలీసులు
- ఎస్పీకి గ్రామస్థుల వినతులు



సంగారెడ్డి క్రైం, జూన్ 27 : సంగారెడ్డి జిల్లాలో దొంగలు రెచ్చిపోతున్నారు. జిల్లా కేంద్రంతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో చోరీలకు తెగబడుతున్నారు. తాళం వేసి ఉన్న ఇల్లు కనిపిస్తే చాలు గుల్ల చేస్తున్నారు. గోడలకు కన్నాలు వేసి అందినంత కాడికి దోచుకుంటున్నారు. ఇంటి బయట నిలిపిన వాహనాలను కూడా వదలడం లేదు. సంగారెడ్డి పట్టణం, మండలం, కొండాపూర్, కంది మండలాల్లో చోరీలు పెరిగిపోతున్నాయి. ఉదయం కాలనీల్లో తిరుగుతూ తాళాలు వేసిన ఇళ్లను గుర్తించి రాత్రివేళ చోరీలకు పాల్పడుతున్నారు. వరుస దొంగతనాలు ఇటు ప్రజలకు, అటు పోలీసులకు కనుకు లేకుండా చేస్తున్నాయి. దొంగలు చోరీ చేసిన సొత్తును ఖర్చు చేసేయడంతో పోలీసులు పట్టుకున్నీ సొత్తు రికవరీ కష్టంగా మారుతోంది. దీంతో బాధితులు పోయిన సొత్తుపై ఆశలు వదులుకోవాల్సి వస్తోంది. విలువైన బంగారు వస్తువులు, నగదు పెద్ద ఎత్తున ఇళ్లల్లో ఉంచి ఊళ్లకు వెళ్లవద్దని పోలీసులు సూచిస్తున్నప్పటికీ ప్రజల్లో మాత్రం మార్పు రావడం లేదు.

గొల్లపల్లిలో..

కొండాపూర్ మండలం గొల్లపల్లి గ్రామంలో ఏప్రిల్ నెలలో ఐదిళ్లల్లో చోరీలు జరిగాయి. ఏప్రిల్ 18న మహబూబ్, షరీఫాబీ ఇంట్లో 8 తులాల బంగారం, 30 తులాల వెండి, రూ.3లక్షల నగదు దోచుకెళ్లారు. సత్తమ్మ ఇంట్లో దొంగలు ప్రవేశించి ఆమెను గొంతు నులిమి చంపుతామని బెదిరించి దొంగతనానికి పాల్పడ్డాడు. మాజీ సర్పంచ్ సదాశివగౌడ్ ఇంట్లో రూ.50వేల నగదు, జూన్ 4వ తేదీన చాకలి చంద్రయ్య ఇంట్లో పది తులాల బంగారం, రూ.2లక్షల నగదు, కిలో వెండి చోరీకి పాల్పడ్డారు. దొంగతనాలను అరికట్టేందుకు పోలీసులు తగు చర్యలు తీసుకోవాలని గొల్లపల్లి గ్రామస్థులు ఎస్పీ చెన్నూరి రూపేష్‌ను కలిసి విన్నవించారు.



తాళ్లపల్లిలో సీసీకెమెరాలో రికార్డయిన దొంగల సంచారం

తాళ్లపల్లిలో..

సంగారెడ్డి మండలం తాళ్లపల్లి గ్రామంలో ఈ నెల 26వ తేదీ తెల్లవారుజామున తలారి భారతీబాయి వద్ద మూడు తులాల బంగారు గొలుసు చోరీ చేశారు. కిరణ్‌కుమార్ ఇంటి ముందు నిలిపిన బైక్‌ను కూడా దొంగలు ఎత్తుకెళ్లారు. గ్రామంలో దొంగలు సంచరిస్తున్న దృశ్యాలు సీసీకెమెరాల్లో రికార్డయ్యాయి.

కందిలో..

కంది మండలం లక్ష్మీనగర్‌కాలనీలో దొంగలు హడలెత్తిస్తున్నారు. నెల రోజులుగా వరుసగా చోరీలు జరుగుతున్నాయి. ఇటీవల ప్రధాన రహదారిపై ఉన్న ఓ బైక్ మెకానిక్‌షాప్ పైకప్పు తొలగించి వస్తువులు దొంగిలించారు. హోటల్ షట్టర్ తాళాలు పగులగొట్టి రూ. 10వేలు దొంగిలించారు. కాలనీకి చెందిన గౌస్ శుభకార్యాయానికి ఇస్నాపూర్‌కు వెళ్లగా దొంగలు ఇంటి తాళం పగులగొట్టి రెండున్నర తులాల బంగారం, రూ. 70వేల నగదు దోచుకెళ్లారు. జుబేర్ కుటుంబం బంధువు అంత్యక్రియలకు వెళ్లి తిరిగి వచ్చేసరికి దొంగలు ఇల్లు గుల్ల చేశారు. ఒకటిన్నర తులాల బంగారం, రూ. 10వేలు పోయినట్లు బాధితుడు తెలిపారు.

- సంగారెడ్డి పట్టణంలోని మంజీరానగర్‌లో ఇళ్ల ముందు నిలిపిన వాహనాలను దొంగలు ఎత్తుకెళ్లారు. ఈ దృశ్యాలు సీసీకెమెరాల్లో రికార్డయ్యాయి.

అనుమానితులు కనిపిస్తే సమాచారమివ్వండి



సంగారెడ్డి జిల్లా, డివిజన్ పరిధిలోని జరుగుతున్న వరుస దొంగతనాలపై దృష్టిసారించాం. రాత్రి వేళల్లో ముమ్మరంగా పెట్రోలింగ్ నిర్వహిస్తున్నాం. అనుమానాస్పదంగా ఎవరైనా కనిపిస్తే పోలీసులకు లేదా 100 నంబరు సమాచారం ఇవ్వాలి. ఇళ్లకు తాళాలు వేసి ఊరెళ్లాల్సి వస్తే పోలీసులకు సమాచారమిస్తే నిఘా ఉంచుతాం. ఇళ్లకు తాళాలు వేసినట్లు కనిపించకుండా కర్టెన్లు వేయాలి. చుట్టుపక్కలవారికి ఓ కంట కనిపెట్టాలని చెప్పివెళ్లాలి. ఎక్కువ రోజులు ఊరెళ్లాల్సి వస్తే బంగారం, నగదు బ్యాంకుల్లో భద్రపర్చుకోవాలి, లేదా వెంట తీసుకెళ్లాలి.

-చెన్నూరి రూపేష్, సంగారెడ్డి ఎస్పీ

అమ్మో.. సర్వేనా!!

- పని ఒత్తిడిలో పంచాయతీ కార్యదర్శులు
- వ్యవసాయ సర్వేకు నో!
- మిషన్ భగీరథ సర్వేకూ బ్రేక్

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, జూన్ 27 : గ్రామ పంచాయతీ కార్యదర్శులు పని ఒత్తిడితో సతమతమవుతున్నారు. శానిటేషన్, తాగునీటి సరఫరా, పన్నుల వసూళ్లు, హరితహారం, నర్సరీల నిర్వహణ వంటి రెగ్యులర్ కార్యక్రమాలతో పాటు అదనపు పనులు చేయాల్సి వస్తున్నదని వాపోతున్నారు. ఇతర విభాగాల పనులు అప్పజెప్తుండటంపై వారు అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు. కార్యదర్శులకు ఇటీవల మిషన్ భగీరథ తాగునీటి సరఫరా, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాల వివరాల సేకరణకు సర్వే చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. ఈ సర్వే చేస్తుండగానే.. వ్యవసాయ సర్వే చేయాలని ఆదేశాలు వచ్చాయి. దీంతో, 75 శాతం పూర్తయిన మిషన్ భగీరథ, వ్యక్తిగత మరుగుదొడ్ల సర్వే నిలిచిపోయింది పంచాయతీ కార్యదర్శులు ఆపేశారు.

వ్యవసాయ సర్వేపై అసంతృప్తి

వ్యవసాయ సర్వేపై పంచాయతీ కార్యదర్శులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో వ్యవసాయ సర్వే జరపాల్సిందిగా అడిషనల్ కలెక్టర్, జిల్లా పంచాయతీ అధికారి గురువారం నాడు టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. కానీ, కొన్ని మండలాల్లో పంచాయతీ కార్యదర్శులు వ్యవసాయ సర్వే చేయలేమని ఎంపీడీవోలకు వినతిపత్రాలు అందజేస్తున్నారు. జిల్లాస్థాయి అధికారుల హెచ్చరికలతో మరికొన్ని మండలాల్లో సర్వే నిర్వహిస్తున్నారు. వ్యవసాయ సర్వేకు సంబంధించి నేల స్వభావం, ఏఏ పంటలు పండటానికి అవకాశం ఉంది? తదితర వివరాలను సర్వే నంబర్లవారీగా ఫొటోలతో సహా నమోదు చేయడం తీవ్రమైన శ్రమతో కూడుకున్నదని కార్యదర్శులు వాపోతున్నారు.

సర్వే ఎందుకంటే?

వ్యవసాయశాఖ అధికారులతో కలిసి పంచాయతీ కార్యదర్శులు చేపట్టిన ఈ సర్వే ఆధారంగానే ప్రభుత్వం రైతు భరోసాను అమలు చేసే అవకాశాలున్నట్లు తెలిసింది. సర్వేలో ఒక్కో రైతుకు ఎంత విస్తీర్ణంలో వ్యవసాయ భూమి ఉన్నది? ఏఏ పంటలు పండిస్తున్నారు? పంటలు పండే వీలున్న భూమి స్వభావం ఏమిటి? తదితర వివరాలను క్షేత్రస్థాయిలో తెలుసుకోనున్నారు. వీరు ఇచ్చే నివేదిక ఆధారంగానే వానాకాలం, యాసంగి పంటలకు రైతు భరోసా పథకం ద్వారా ప్రభుత్వం డబ్బులు చెల్లించనున్నది. అయితే ఐదెకరాల లోపు వ్యవసాయ భూమి ఉన్న రైతులకు ఎకరాలను బట్టి ప్రభుత్వం రైతు భరోసా ద్వారా డబ్బులు చెల్లించే అవకాశాలున్నట్లు తెలిసింది.

పైసలు సరే.. జాగా ఓకే..

..అయినా ఎక్కడ వేసిన గొంగడి అక్కడే

తూనికలు, కొలతల భవన నిర్మాణంలో జాప్యం



గుంతల స్థాయిలోనే తూనికలు, కొలతలశాఖ జిల్లా కార్యాలయం

ఆంధ్రజ్యోతి ప్రతినిధి సంగారెడ్డి, జూన్ 27 : అద్దె భవనంలో కొనసాగుతున్న తూనికలు, కొలతల శాఖ జిల్లా కార్యాలయ భవన నిర్మాణం నిధులున్నా ముందుకు సాగడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం స్థలం కేటాయించగా, కాంట్రాక్టు పొందిన పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ పిల్లర్ల కోసం గుంతలు తవ్వి.. నిర్మాణం మరిచింది. దీంతో భవన నిర్మాణం గుంతల స్థాయిలోనే నిలిచిపోయింది. ఫలితంగా తూనికలు, కొలతలశాఖ జిల్లా కార్యాలయం సంగారెడ్డిలో అద్దెఇంట్లో కొనసాగుతున్నది.

భవనం కోసం రూ.50 లక్షలు మంజూరు

తూనికలు, కొలతల శాఖ జిల్లా కార్యాలయ భవన నిర్మాణం కోసం కేంద్ర ప్రభుత్వం 2018 సెప్టెంబరు 29న రూ.50 లక్షలు మంజూరు చేసింది. రెండతస్థుల భవన నిర్మాణం కోసం అప్పట్లో రాష్ట్ర ప్రభుత్వం బైపాస్ రోడ్డులోని మండల ప్రజా పరిషత్ కార్యాలయం సమీపంలో ఐదు గుంటల భూమిని కేటాయించింది. ఈ భూమిని తూనికలు, కొలతల శాఖకు అప్పగించేందుకు సర్వే అధికారులు రాగా, కాలనీవాసులు అడ్డుకున్నారు. దీంతో ఏళ్లు గడిచినా స్థలం కేటాయింపు అంశం పరిష్కారం కాలేదు. అధికారులు చొరవ చూపకపోవడంతో నిధులు అలానే ఉన్నాయి.

175 చదరపు గజాలు కేటాయింపు

తూనికలు, కొలతశాఖ జిల్లా కార్యాలయ భవనం నిర్మాణం కోసం ప్రభుత్వం గత ఏడాదిలో బైపాస్ రోడ్డులోని బీసీ స్టడీ సర్కిల్ పక్కన 175 చదరపు గజాల (1,573 ఎస్ఎఫ్‌టీ) స్థలం కేటాయించింది. భవన నిర్మాణ బాధ్యతలను పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్‌కు అప్పగించింది. గత మార్చిలో నిర్మాణం మొదలుపెట్టి తొమ్మిది నెలల్లో భవన నిర్మాణ పూర్తిచేస్తామని పేర్కొన్నారు. కానీ పిల్లర్ల కోసం గుంతలు తవ్విన కార్పొరేషన్ మూడు నెలలుగా నిర్మాణం కొనసాగించకపోవడంతో గుంతలే మిగిలాయి. కేంద్రం మంజూరు చేసిన నిధులు అందుబాటులో ఉన్నా నిర్మాణ పనులు సాగించకపోవడానికి కారణాలు తెలియడం లేదు. దీంతో తూనికలు కొలతలశాఖ జిల్లా కార్యాలయం అద్దె భవనంలో కొనసాగిస్తున్నారు.

భూ తగాదాలతో దారుణ హత్య

- కట్టెలతో కొట్టి.. బండరాయితో మోది..
- మెదక్ జిల్లా లక్ష్మాపూర్‌లో ఉద్రిక్తత
- ఆగ్రహంతో నిందితుల గడ్డివాములకు నిప్పు
- గ్రామంలో పోలీసుల పికెటింగ్



రాగుల అశోక్ (ఫైల్)

రామాయంపేట, జూన్ 27 : భూ తగాదాలు, పాత కక్షలతో ఓ కుటుంబం పక్క పొలం రైతును హత్య చేసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ జిల్లా రామాయంపేట మండలం లక్ష్మాపూర్‌కు చెందిన గ్రామానికి చెందిన రాగుల అశోక్(50), చేపూరి రమేష్ కుటుంబాలకు చెందిన పొలాలు పక్కపక్కనే ఉన్నాయి. రెండు కుటుంబాల మధ్య పొలం గెట్టు విషయంలో ఘర్షణలు చోటుచేసుకుంటున్నాయి. రెండు కుటుంబాలపై 20 కేసుల వరకు నమోదయ్యాయి. చేపూరి రమేష్ కొడుకు భరత్‌తేజ ఇదే కేసుల్లో మూడు నెలలు జైలుకు వెళ్లివచ్చాడు. దీంతో విద్వేషాలు మరింత పెరిగాయి. దీంతో ఎలాగైనా అశోక్‌ను హత్య చేయాలని రమేష్ కుటుంబం నిర్ణయించుకుంది. ఈమేరకు గురువారం ఉదయం రాగుల అశోక్ పొలం పనుల్లో నిమగ్నమయిన సమయంలో రమేష్, భార్య వెంకటలక్ష్మి, కుమారులు భరత్‌తేజ, వినయ్‌తేజ అతనిపై దాడి చేశారు. వెంటపడి కర్రలతో కొట్టి, గొడ్డలితో దాడి చేశారు. కొందపడిన అతడి తలపై బండరాయితో మోదారు. దీంతో అశోక్ అక్కడికక్కడే మృతిచెందగా నిందితులు అతడి మృతదేహాన్ని పొలంలో గట్టు వివాదం నెలకొన్న ప్రాంతానికి లాక్కొచ్చి పడేశారు. నిందితులు ముందుగానే తమ పాడి పశువులను ఇతర ప్రాంతాలకు తరలించి, కుటుంబంతో సహా పరారయ్యారు. విషయం తెలిసిన గ్రామస్థులు ఆగ్రహంతో నిందితుల గడ్డివాములకు నిప్పు పెట్టారు. ట్రాక్టర్‌ను కూడా తగులబెడుతుండగా సమాచారం తెలుసుకున్న పోలీసులు చేరకుని అడ్డుకున్నారు. సీఐ వెంకటరాజాగౌడ్ ఆధ్వర్యంలో నలుగురు ఎస్ఐలు, పెద్దఎత్తున పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించేందుకు ప్రయత్నం చేయగా గ్రామస్థులు అడ్డుకుని వాగ్వాదానికి దిగారు. సీఐ వారికి నచ్చజెప్పి శాంతింపజేశారు. సంగారెడ్డి నుంచి వచ్చిన క్లూస్‌టీం ఘటనా స్థలిలో పలు ఆనవాళ్లు సేకరించింది. ఉద్రిక్తతల నేపథ్యంలో లక్ష్మాపూర్‌లో పోలీసులు పికెటింగ్ ఏర్పాటు చేశారు. హత్యోదంతంపై తూప్రాన్ డీఎస్పీ వెంకటరెడ్డి సాయంత్రం విలేకరులతో మాట్లాడారు. పాతకక్షలు, పొలం పంచాయితీయే హత్యకు కారణమని తెలిపారు. నిందితులను త్వరలోనే పట్టుకుంటాని చెప్పారు.



పోలీసులతో వాగ్వాదానికి దిగిన గ్రామస్థులు



గ్రామంలో పహారా కాస్తున్న పోలీసులు

ధరణిపై స్పెషల్ డ్రైవ్

- సమస్యల పరిష్కారంపై దృష్టి
- మండలాల వారీగా దరఖాస్తుల పరిశీలన



చిలప్‌చెడ్ తహసీల్దార్ కార్యాలయంలో ధరణి దరఖాస్తుల పురోగతిని అడిగి తెలుసుకుంటున్న మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్, జూన్ 27: ధరణి పెండింగ్ సమస్యల పరిష్కారానికి జిల్లా రెవెన్యూ అధికారులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నారు. మొన్నటి వరకూ ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో దరఖాస్తుల పరిశీలనకు బ్రేక్ వేయగా, తాజాగా కోడ్ ముగియడంతో తిరిగి ధరణి సమస్యలపై సర్కారు దృష్టిసారించింది. సీసీఎల్‌ఏ (చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ రికార్డ్స్) కమిషనర్ ఆదేశాలతో అపరిష్కృతంగా ఉన్న భూసమస్యలకు నెలాఖరు వరకు పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ రెవెన్యూ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

భూ సమస్యల పరిష్కారం కోసం గత ప్రభుత్వం ధరణి పోర్టల్‌ను ప్రవేశపెట్టింది. కొన్నేళ్లుగా భూములు ధరలు పెరిగిపోవడంతో భూవివాదాలూ పెరిగిపోయాయి. గతంలో అధికారులు చేసిన తప్పిదాలు సైతం రైతులకు శాపంలా పరిణమించాయి. భూ విస్తీర్ణంలో తేడాలు, సర్వే నంబర్లు తప్పుగా ఎంట్రీ కావడం, పట్టా భూములు నిషేధిత భూముల జాబితాలో చేర్చడం, పాసు పుస్తకాలలో సవరణలు, వారసత్వ సమస్యలు, మ్యూటేషన్లు తదితర సమస్యలతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని రెవెన్యూ అధికారులకు అర్జీలు పెట్టుకుంటున్నారు. ధరణి పోర్టల్ దరఖాస్తుల పరిశీలనలో జాప్యం జరగడంతో అర్జీలు పేరుకుపోయాయి. దీంతో, ధరణి దరఖాస్తుల ఆమోదం, తిరస్కరణపై జిల్లా కలెక్టర్‌కు ఉన్న అధికారాలను క్యాటగిరీలవారీగా విభజించారు. మండలాలవారీగా ప్రత్యేక డ్రైవ్‌లు చేపట్టి తహసీల్దార్లకు కొన్ని మాడ్యువల్స్ అప్పగించారు. వారసత్వ బదిలీ ప్రక్రియ, అసైన్‌మెంట్ భూములు తదితర సమస్యలకు సంబంధించి పరిశీలన చేస్తున్నారు. టీఎం-20 ఎస్ఆర్ఐలకు చెందిన భూముల సమస్యలు, టీఎం-16 భూ సేకరణకు సంబంధించిన సమస్యలు, టీఎం-26 కోర్టు కేసులు,పాసు పుస్తకాలలో తప్పులు నమోదు, తదితర సమస్యలను ఆర్డీవో పరిష్కరించనున్నారు. రూ. 5 లక్షల విలువ గల భూసమస్యలు ఆర్డీవో పరిధిలో, రూ.5 లక్షల నుంచి రూ.50 లక్షల లోపు విలువైన భూ సమస్యల పరిష్కరించడం కలెక్టర్ పరిధిలో చేర్చారు. ఆపై విలువ కలిగిన భూ సమస్యల పరిష్కారం సీసీఎల్‌ఏ ఆధ్వర్యంలోనే పరిష్కరించనున్నారు.

ఇటీవల జూన్ 14వ తేదీన జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, రెవెన్యూ అధికారులతో సీసీఎల్‌ఏ కమిషనర్ సమీక్ష జరిపే నాటికి జిల్లావ్యాప్తంగా ధరణి సమస్యలపై 7,500 ఫిర్యాదులు వచ్చినట్లు అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. ప్రస్తుతం 2,795 దరఖాస్తులు పెండింగులో ఉన్నాయన్నారు.

దరఖాస్తుల పెండింగ్ వద్దు

మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

చిలప్‌చెడ్, జూన్ 27: పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు చిలప్‌చెడ్ మండల తహసీల్దార్ కార్యాలయాన్ని గురువారం ఆయన సందర్శించారు. రికార్డులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ధరణి దరఖాస్తులు పెండింగ్‌లో ఉంచొద్దని సూచించారు. అంతకుముందు ఆయన రైతు ఆగ్రోస్ సేవా కేంద్రాన్ని తనిఖీ చేశారు. అనంతరం ఉన్నత పాఠశాలను సందర్శించి, బోధనా నైపుణ్యాలు మెరుగుపర్చాలని సూచించారు. గ్రామంలో పారిధ్య నిర్వహణను పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి పౌష్టికాహార పంపిణీ వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ వినోదదుర్గారెడ్డి, డీఈవో రాధాకృష్ణ, జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్, తహసీల్దార్ ముసాధిక్, ఎంపీడీవో ఆనంద్, డిప్యూటీ తహసిల్దార్ సింధుజ, నోడల్ ఆఫీసర్ విఠల్ తదితరులు పాల్గొన్నారు.

కాలుష్య వ్యర్థాలు ఎక్కడి నుంచి వచ్చాయి?



చిట్కుల్ పెద్ద చెరువులో తేలుతున్న చేపలు

6లో

- పెద్దచెరువులో పది టన్నుల చేపల మృతితో మత్స్యకారుల ఆగ్రహం
- రూ.కోటి నష్టం వాటిల్లడంతో ఆవేదన
- పీసీబీ అధికారులపై మండిపాటు
- మెడికల్ కళాశాలపై విచారణ చేపట్టాలన్న గంగపుత్రులు



హరివిల్లు.. కనువిందు

మెదక్ జిల్లాకేంద్రంలో ఆకాశంలో సప్తవర్ణాల హరివిల్లు కనువిందు చేసింది. చిరుజల్లులు కురుస్తుండగా చూడ ముచ్చటైన హరివిల్లును సెల్‌ఫోన్‌లో బందిస్తూ యువత సంబరపడ్డారు.

-మెదక్ కల్చరల్

739 మంది ఎస్జీటీలకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి

నేటి నుంచి ఎస్జీటీ బదిలీల ప్రక్రియ షురూ

సంగారెడ్డి అర్బన్, జూన్ 27 : ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ కొనసాగుతున్నది. ఇందులో భాగంగా జిల్లావ్యాప్తంగా జడ్పీ యాజమాన్య పరిధిలో 739 ఎస్జీటీ, తత్సమాన ఉపాధ్యాయులకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి పొందారు. ఈమేరకు ఉత్వర్వులు వెలువడగా పదోన్నతి పొందినవారు గురువారం విధుల్లో చేరారు. ఇక, ఎస్జీటీల బదిలీల ప్రక్రియ నేటి నుంచి ప్రారంభంకానున్నది. భాషోపాధ్యాయుల అప్‌గ్రేడేషన్‌పై పీఆర్‌టీయూ-తెలంగాణ జిల్లా అధ్యక్షుడు మహ్మద్ అబ్దుల్లా మాట్లాడుతూ సంవత్సరాల పోరాట ఫలితంగానే భాషోపాధ్యాయుల అప్‌గ్రేడేషన్ జరిగిందని పేర్కొన్నారు. అప్‌గ్రేడేషన్‌కు సహకరించిన సీఎం రేవంత్‌రెడ్డి, విద్యాశాఖ కమిషనర్ దేవసేన, డీఈవో వెంకటేశ్వర్లుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.



జిన్నారం మండలం నల్తూర్‌లో స్కూల్ అసిస్టెంట్‌గా విధుల్లో చేరుతున్న భాషోపాధ్యాయుడు అబ్దుల్లా

కాలుష్య వ్యర్థాలు ఎక్కడి నుంచి వచ్చాయి?

పెద్దచెరువులో పది టన్నుల చేపల మృతితో మత్స్యకారుల ఆగ్రహం

- రూ.కోటి వరకు నష్టం వాటిల్లడంతో ఆవేదన
- పీసీబీ అధికారులపై మండిపాటు
- మహేశ్వరం మెడికల్ కళాశాలపై విచారణ చేపట్టాలన్న గంగపుత్రులు

పటాన్‌చెరు రూరల్, జూన్ 27 : చిట్కుల్ గ్రామం పెద్దచెరువులో బుధవారం పెద్దఎత్తున చేపల మృత్యువాత పడడంతో మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెరువులోకి కాలుష్య వ్యర్థాలు ఎక్కడి నుంచి వచ్చాయో ఇంతవరకు అధికారులు కనిపెట్టలేకపోయారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పది టన్నుల మేర చేపలు మృతిచెందితే విచారణ వేగవంతం చేయాల్సిన కాలుష్య నియంత్రణ మండలి(పీసీబీ), మత్స్యశాఖ అధికారులు కేవలం నీటి నమూనాలను సేకరించి నివేదిక ఇస్తామని చెప్పి వెళ్లిపోవడంపై మండిపడుతున్నారు. రూ.కోటి మేర నష్టం వాటిల్లడంతో గంగపుత్రులు లబోదిబోమంటున్నారు. పాశమైలారం పారిశ్రామిక వాడ నుంచి పెద్దచెరువులోకి వ్యర్థాలు విడుదల చేస్తున్న పరిశ్రమల యాజమాన్యాలకు పీసీబీ అధికారులు అండగా ఉంటున్నారన్న అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు.

నివేదిక కోసం ఎదురుచూపులు

పీసీబీ, మత్స్యశాఖ అధికారులు విచారణ చేపట్టి నీటి నమూనాలను సేకరించటంతో మత్స్యకారులంతా ఈ నివేదిక కోసం ఎదురుచూస్తున్నారు. చిత్తశుద్ధితో విచారణ చేసి బాధ్యులపై కఠిన చర్యలు చేపట్టకుంటే తాము ఎంతటి ఉద్యమానికైనా సిద్ధమని హెచ్చరిస్తున్నారు. పెద్దచెరువు సమీపంలోనే ఉన్న ప్రైవేటు మెడికల్ కళాశాల వ్యర్థాలు చెరువులో కలవటం వల్లే చేపలు మృతి చెంది ఉండవచ్చని పలువురు మత్స్యకారులు పీసీబీ అధికారులకు ఫిర్యాదు చేశారు. మెడికల్ కళాశాల నుంచి వస్తున్న వ్యర్థాలు ఎక్కడ నిర్వీర్యం చేస్తున్నారో ఇంతవరకు పీసీబీ అధికారులకు కూడా తెలియదని, దీనిపై ఎందుకు దృష్టి సారించడం లేదని ప్రశ్నిస్తున్నారు. స్థానిక మత్స్యకారులు పెద్ద ఎత్తున నష్టపోవడంతో చలించిన కాంగ్రెస్ నాయకుడు నీలం మధు ముదిరాజ్ మత్స్యకారులను ఆర్థికంగా ఆదుకుంటానని హామీ ఇచ్చారు. చేపల మృతికి కారణాలను అధికారులు విచారణ చేపట్టారని, అవసరమైతే సంబంధిత మంత్రి, ముఖ్యమంత్రి దృష్టికి విషయాన్ని తీసుకెళ్లి కఠిన చర్యలు తీసుకునేలా చూస్తానని ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు.



చిట్కుల్ పెద్దచెరువులో తేలుతున్న చేపలు

చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించం

- గంజాయి సాగు చేయడం, విక్రయించడం నేరం
- సంగారెడ్డి ఎస్పీ చెన్నూరి రూపేష్



కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్పీ రూపేష్

నారాయణఖేడ్, జూన్ 27: చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిని ఉపేక్షించబోమని ఎస్పీ చెన్నూరి రూపేష్ హెచ్చరించారు. నారాయణఖేడ్ సబ్ డివిజన్ కార్యాలయంలో గురువారం నేరాల సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. గతంలో గంజాయి సాగు, అక్రమ రవాణ చేసిన కేసుల నిందితులకు ఎస్పీ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదకద్రవ్యాల నిర్మూలన కోసం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. గంజాయిని సాగు చేయడం, విక్రయించడం, వారికి సహకరించడం నేరమన్నారు. వారిపై పీడీ యాక్టు కేసులు నమోదు చేస్తామన్నారు. ఎక్కడైన గంజాయి సాగు, విక్రయాలు చేసినట్లయితే తమకు సమాచారం అందించాలని, వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. మాదక ద్రవ్యాల పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించడానికి కళాశాలలు, పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా పోలీసు అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. డ్రంకెన్ డ్రైవ్, సైబర్ నేరాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. డివిజన్ పరిధిలోని పోలీస్ స్టేషన్ల వారీగా కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో స్థానిక డీఎస్పీ వెంకటరెడ్డి, ఖేడ్, కంగ్టి సీఐలు శ్రీనివాస్‌రెడ్డి, చంద్రశేఖర్, డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ రమేష్, సబ్ డివిజన్ పరిధిలోని ఎస్ఐలు పాల్గొన్నారు.

ఎండు గంజాయి స్వాధీనం.. ఒకరి అరెస్ట్

సంగారెడ్డి క్రైం, జూన్ 27 : ఎండు గంజాయిని తరలిస్తున్న ఒకరిని అరెస్ట్ చేసినట్లు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ జి.శ్రీనివాస్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పటాన్‌చెరు మండలం పాశమైలారం వద్ద గురువారం ఉదయం వాహనాల తనిఖీ నిర్వహించినట్లు తెలిపారు. ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన రాజ్‌కుమార్‌సింగ్ పాశమైలారంలో నివస్తుండగా తన బైక్‌పై ఎండు గంజాయి రవాణా చేస్తూ పట్టుబడినట్లు పేర్కొన్నారు. 350 గ్రాముల ఎండు గంజాయి స్వాధీనం చేసుకొని నిందితుడిని అదుపులోకి తీసుకున్నామని వెల్లడించారు. ఈ తనిఖీల్లో ఎక్సైజ్ సీఐ సీహెచ్.చంద్రశేఖర్, ఎస్ఐ బి.యాదయ్య, హెడ్ కానిస్టేబుల్ ఎండీ అలీమ్, కానిస్టేబుళ్లు ఎం.గోపాల్, రామారావు, సతీష్, ఖరీమ్ తదితరులు పాల్గొన్నారు.

అగ్రికల్చర్ ఆఫీసర్ ఉద్యోగం సాధించిన మల్లంపల్లి యువతి



కొలిపాక యామిని

అక్కన్నపేట, జూన్ 27 : తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అగ్రికల్చరల్ ఆఫీసర్ పరీక్ష ఫలితాలు బుధవారం రాత్రి ప్రకటించారు. ఇందులో రాష్ట్రస్థాయిలో 68వ ర్యాంకు సాధించి అక్కన్నపేట మండలం మల్లంపల్లి గ్రామానికి చెందిన కొలిపాక యామిని అగ్రికల్చర్ ఆఫీసర్‌గా ఎంపికైంది. తండ్రి కొలిపాక వెంకటమల్లు ప్రభుత్వ ఉపాధ్యాయుడు కాగా, తల్లి రజిత గృహిణి. యామిని ఎస్ఎస్‌సీ వరకు హుస్నాబాద్‌లోని సెయింట్ జోసెఫ్ స్కూల్లో, ఇంటర్ ఎస్ఆర్ కాలేజ్ హన్మకొండలో, బీఎస్సీ అగ్రికల్చర్, ఎంఎస్సీ అగ్రి బిజినెస్ మేనేజ్‌మెంట్ ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ హైదరాబాద్‌లో అభ్యసించారు. ఉద్యోగం సాధించడంతో తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు.

నాచగిరి క్షేత్రానికి వేలం ద్వారా రూ.17.95 లక్షల ఆదాయం

వర్గల్, జూన్ 27 : నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో గురువారం నిర్వహించిన వేలం పాటలో రూ.17,95,000 ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి అన్నపూర్ణ తెలిపారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ ఉమ్మడి మెదక్ జిల్లా సహాయ కమిషనర్ శివరాజ్ పర్యవేక్షణలో వివిధ రకాల వస్తువులు, సామగ్రిపై టెంటర్, ఓపెన్ వేలం నిర్వహించగా ఆలయ కార్యనిర్వహణాధికారి వివరాలను తెలియజేశారు. టెంట్ సామగ్రికి హైదరాబాద్ ధర్మశాస్త్ర ఎంటర్‌ప్రైజెస్ వారికి రూ.8.50 లక్షలు, తలనీలాలు రూ.4.30 లక్షలు, దోతులు, చీరలు పోగు చేసుకునట రూ.3.90 లక్షలకు, పాదరక్షలు భద్రపరుచుట రూ.1.25లక్షలు పలికాయి. గత సంవత్సరం వేలం ద్వారా రూ.15.66లక్షలు రాగా, ఈ ఏడాది రూ.2.29 లక్షల అదనంగా వచ్చినట్లు కార్యనిర్వహణాధికారి తెలిపారు.

నేడు మల్లన్న ఆలయంలో బహిరంగ వేలం

చేర్యాల, జూన్ 27 : కొమురవెల్లి మల్లన్న ఆలయంలో నేడు సీల్డ్ టెండర్ కమ్ బహిరంగ వేలం పాటలు నిర్వహించనున్నారు. మల్లన్న, ఎల్లమ్మ ఆలయ ఆవరణలో కొబ్బరికాయల విక్రయం, భక్తులు మొక్కుబడులుగా సమర్పించిన తలనీలాలు, మొక్కుబడి శేషవస్త్రాలు, పసుపు, ఒడిబియ్యం, కొబ్బరి ముక్కల సేకరణతో పాటు ఆలయానికి పాలు, పూలు, కూరగాయల సరఫరాతో పాటు టాయిలెట్ బ్లాక్‌ల లీజుకు వేలంపాటలు నిర్వహించనున్నట్లు ఈవో బాలాజీ తెలిపారు. ఇటీవల పలువురు దరఖాస్తు చేసుకోగా, షెడ్యూల్ జారీ చేశామని, నేడు దేవాదాయశాఖ అధికారి సమక్షంలో వేలం పాటలు జరపనున్నామని పేర్కొన్నారు.

కిక్ బాక్సింగ్ చాంపియన్‌గా హోంగార్డు కుమారుడు

- అభినందించిన సంగారెడ్డి ఎస్పీ రూపేష్



రఘువంశీని అభినందిస్తున్న ఎస్పీ రూపేష్

సంగారెడ్డి క్రైం, జూన్ 27 : ఆల్ ఇండియా కిక్ బాక్సింగ్ పోటీల్లో చాంపియన్‌గా నిలిచిన సంగారెడ్డికి చెందిన హోంగార్డ్ ముత్యం కుమారుడు రఘువంశీని గురువారం సంగారెడ్డి ఎస్పీ చెన్నూరి రూపేష్ జిల్లా పోలీసు కార్యాలయంలో అభినందించారు. పూణేలోని ఛత్రపతి శివాజీ స్టేడియంలో ఇటీవల నిర్వహించిన ఆల్ ఇండియా కిక్ బాక్సింగ్ టోర్నమెంట్‌లో రఘువంశీ చాంపియన్‌గా నిలిచాడు. ఈ టోర్నమెంట్‌లో 27 రాష్ట్రాలకు చెందిన బాక్సర్లు పోటీపడగా రఘువంశీ ఉత్తమ ప్రతిభ కనబరిచారు. రఘువంశీ సంగారెడ్డి పట్టణంలోని అక్షర పాఠశాలలో 6వ తరగతి చదువుతూ, స్థానిక వారియర్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీలో మాస్టర్ పోచయ్య వద్ద రెండేళ్లుగా శిక్షణ తీసుకుంటున్నారు. భవిష్యత్‌లో మరిన్ని పతకాలు సాధించాలని, అందుకు తగిన అభ్యాసన చేయాలని ఎస్పీ సూచించారు.

జంతర్ మంతర్ వద్ద ఆందోళనలో టీపీసీసీ సభ్యుడు శ్రీనివాస్



ఢిల్లీలో ఆందోళనలో పాల్గొన్న శ్రీనివాస్

నారాయణఖేడ్, జూన్ 27 : నీట్ పరీక్షా పేపర్ లీక్‌ను నిరసిస్తూ యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద గురువారం ఆందోళన నిర్వహంచారు. ఈ నిరసనలో యూత్ కాంగ్రెస్ సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు ఉదయ్‌శంకర్ పటేల్, నారాయణఖేడ్ అసెంబ్లీ అధ్యక్షులు, టీపీసీసీ సభ్యుడు కె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అసదుద్దీన్ ఓవైసీపై చర్యలు తీసుకోవాలి

- సీపీకి హిందూ వాహిని నాయకుల వినతి

సిద్దిపేట క్రైం, జూన్ 27 : ఎంపీ అసదుద్దీన్ ఓవైసీపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని సిద్దిపేట జిల్లా హిందూ వాహిని ఆధ్వర్యంలో సిద్దిపేట పోలిస్ కమిషన్ డాక్టర్ బి.అనురాధకు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా హిందూ వాహిని కార్యకర్తలు మాట్లాడుతూ పార్లమెంట్‌లో అసదుద్దీన్ ఓవైసీ తన ప్రమాణ స్వీకారం సందర్భంగా చేసిన 'జై పాలస్తీనా' నినాదం దేశ సమగ్రతను, ఐక్యతను దెబ్బతీసే విధంగా ఉందని అతనిపై చర్య తీసుకోవాలని కోరారు.

మహిళ కడుపులోని 10 కిలోల తిత్తి తొలగింపు

రామచంద్రాపురం, జూన్ 27 : సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురం పట్టణంలోని మెడికవర్ ఆసుపత్రి వైద్యులు ఓ మహిళ(40)కు ఓపెన్ సర్జరీ చేసి 10 కిలోల బరువు, 17/16/11 సెంటీమీటర్ల పరిమాణం గల తిత్తిని తొలగించారు. ఇందుకు సంబంధించిన వివరాలను సీనియర్ గైనకాలిస్ట్ డాక్టర్ మిథున, వైద్య బృందం సభ్యులు గురువారం విలేకరులకు వివరించారు. సోమవారం ఓ మహిళ కడుపునొప్పితో మెడికవర్ ఆసుపత్రిలో చేరారు. సదరు మహిళకు వైద్య పరీక్షలు నిర్వహించగా పొత్తి కడుపులో కణతి ఉన్నట్టు గుర్తించారు. ఇది పొత్తి నుంచి బొడ్డు వరకు ఉన్నది. టోటో పద్ధతి శస్త్ర చికిత్స చేపట్టి తొలగించారు. తమ ఆసుపత్రిలో ఇప్పటి వరకు 15 సెంటీమీటర్ల తిత్తిని మాత్రమే తొలగించగా, ఇది అతిపెద్ద తిత్తి అని వైద్యురాలు మిథున పేర్కొన్నారు. ఇలాంటివి రుతుస్రావం నిలిచిన మహిళలు, బాలికల్లో కనిపిస్తాయన్నారు. దీన్ని నిర్లక్ష్యం చేస్తే కాన్సర్ వచ్చే అవకాశాలుంటాయని హెచ్చరించారు.

సెన్సెక్స్ 79,000 పైకి..
24,000 స్థాయికి నిఫ్టీ

- సరికొత్త ఉన్నత శిఖరాలకు సూచీలు
- నాలుగో రోజూ లాభాల బాటలో మార్కెట్
- రూ.438.41 లక్షల కోట్లకు మదుపరుల సంపద

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లో గురువారం రికార్డుల మోత మోగింది. వరుసగా నాలుగో రోజూ ర్యాలీ తీసిన ప్రామాణిక సూచీలు సరికొత్త ఉన్నత శిఖరాలను అధిరోహించాయి. సెన్సెక్స్ తొలిసారిగా 79,000 మైలురాయిని చేరగా.. నిఫ్టీ 24,000 మార్క్‌ను దాటింది. మార్కెట్ దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్‌తో పాటు ఐటీ కంపెనీలైన టీసీఎస్, ఇన్ఫోసిస్ షేర్లలో కొనుగోళ్లు సూచీలను మరింత ముందుకు నడిపించాయి. సెన్సెక్స్ ఒక దశలో 721.78 పాయింట్లు ఎగబాకి 79,396.03 వద్ద సరికొత్త ఆల్‌టైం ఇంట్రాడే రికార్డును నమోదు చేసింది. ట్రేడింగ్ నిలిచేసరికి, సూచీ 568.93 పాయింట్ల లాభంతో 79,243.18 వద్ద స్థిరపడింది. సూచీకిది సరికొత్త జీవితకాల గరిష్ఠ ముగింపు కూడా. నిఫ్టీ సైతం ఒక దశలో 218.65 పాయింట్ల వృద్ధితో 24,087.45 వద్ద ఆల్‌టైం ఇంట్రాడే రికార్డును, చివర్లో 175.70 పాయింట్ల లాభంతో 24,044.50 వద్ద కొత్త జీవిత కాల గరిష్ఠ ముగింపును నమోదు చేసింది.

ఈ మంగళవారం 78,000 స్థాయికి చేరిన సెన్సెక్స్.. కేవలం రెండు ట్రేడింగ్ సెషన్లలోనే మరో 1,000 పాయింట్ల మేర పుంజుకుంది. గత నెల 24న తొలిసారిగా 23,000 మైలురాయిని తాకిన నిఫ్టీ, కేవలం 23 ట్రేడింగ్ సెషన్లలో మరో 1,000 పాయింట్లు వృద్ధిని కనబరిచింది. మార్కెట్ జైత్రయాత్రలో ఈక్విటీ ఇన్వెస్టర్ల సంపదగా పరిగణించే బీఎస్ఈ నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ సైతం సరికొత్త జీవిత కాల గరిష్ఠ స్థాయి రూ.438.41 లక్షల కోట్లకు (5.25 లక్షల కోట్ల డాలర్లు) చేరుకుంది. గడిచిన నాలుగు ట్రేడింగ్ సెషన్లలో సెన్సెక్స్ 2,033.28 పాయింట్లు (2.63 శాతం) పుంజుకోగా.. మార్కెట్ సంపద రూ.3.93 లక్షల కోట్లు పెరిగింది.

వచ్చే నెల 3 నుంచి ఎమ్‌క్యూర్ ఫార్మా ఐపీఓ

అంతర్జాతీయ ప్రైవేట్ ఈక్విటీ దిగ్గజం బెయిన్ క్యాపిటల్ పెట్టుబడులు కలిగిన ఎమ్‌క్యూర్ ఫార్మా తొలి పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ) వచ్చేనెల 3న ప్రారంభమై 5న ముగియనుంది. ఐపీఓలో భాగంగా కంపెనీ రూ.800 కోట్ల తాజా ఈక్విటీ జారీతో పాటు ప్రస్తుత ప్రమోటర్లు, వాటాదారులకు చెందిన 1.14 కోట్ల ఈక్విటీ షేర్లను ఆఫర్ ఫర్ సేల్ (ఓఎ్‌ఫఎస్) పద్ధతిన విక్రయించనుంది. వచ్చేనెల 10న కంపెనీ తన షేర్లను స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదు చేసే అవకాశం ఉంది.

జేపీ మోర్గాన్ బాండ్ ఇండెక్స్‌లోకి భారత ప్రభుత్వ సెక్యూరిటీలు

భారత ప్రభుత్వ బాండ్లు (జీ-సెక్) శుక్రవారం నుంచి జేపీ మోర్గాన్-ఎమర్జింగ్ మార్కెట్ బాండ్ ఇండెక్స్‌లో భాగం కానున్నాయి. వచ్చే 10 నెలల (2024 జూన్ 28 నుంచి 2025 మార్చి 31) కాలంలో ఈ సూచీలో చేరనున్నాయి. నెలకు ఒక శాతం చొప్పున పది నెలల్లో గరిష్ఠంగా సూచీలో 10 శాతం వెయిటేజీ వరకు భారత జీ-సెక్‌లను సూచీలో చేర్చనున్నారు. తద్వారా వచ్చే పది నెలల్లో మన ప్రభుత్వ బాండ్లలోకి కనీసం 2,000-2,500 కోట్ల డాలర్ల మేర విదేశీ పెట్టుబడులు రావచ్చని అంచనా. దాంతో మన జీ-సెక్‌ల రేట్లు తగ్గడంతో ప్రభుత్వానికి రుణ సమీకరణ వ్యయం కూడా తగ్గనుందని విశ్లేషకులు పేర్కొన్నారు.

ఇండియా సిమెంట్స్‌లో అల్ట్రాటెక్ పాగా

రూ.1,900 కోట్లతో 23% వాటా కొనుగోలు

న్యూఢిల్లీ: దేశీయ సిమెంట్ రంగంలో కన్సాలిడేషన్ కొనసాగుతోంది. తాజాగా ఆదిత్య బిర్లా గ్రూప్ కంపెనీ అల్ట్రాటెక్ సిమెంట్.. చెన్నై కేంద్రంగా ఉన్న ఇండియా సిమెంట్స్ ఈక్విటీలో 22.77 శాతం వాటా కొనుగోలు చేసింది. ఇందుకోసం రూ.1,889.27 కోట్లు చెల్లించింది. డీమార్ట్ ప్రమోటర్ రాధాకృష్ణ దమానీ, ఆయన కుటుంబ సభ్యుల నుంచి అల్ట్రాటెక్ 2 బ్లాక్ డీల్స్ ద్వారా ఈ వాటాలు కొనుగోలు చేసింది. ఇందుకోసం మొదటి బ్లాక్ డీల్‌లో ఒక్కో షేరుకు రూ.265 చొప్పున, రెండో బ్లాక్ డీల్‌లో ఒక్కో షేరుకు రూ.285 చొప్పున చెల్లించింది.

ముందు చూపుతోనే: ఇది కేవలం పెట్టుబడి లాభాల కోసం జరిపిన కొనుగోలు అని అల్ట్రాటెక్ చెబుతోంది. అయితే ఇప్పటికే నష్టాల్లో ఉన్న ఇండియా సిమెంట్స్‌ని ఎలాగైనా కైవసం చేసుకునే వ్యూహంతోనే అల్ట్రాటెక్.. ఇండియా సిమెంట్స్ ఈక్విటీలో 23 శాతం వాటా కొనుగోలు చేసిందని భావిస్తున్నారు. గతంలో బీవీ రాజు నిర్వహణలోని రాశి సిమెంట్, విష్ణు సిమెంట్ టేకోవర్ కోసం గతంలో ఇండియా సిమెంట్స్ కూడా ఇదే వ్యూహాన్ని అనుసరించింది. ముందు పెట్టుబడి లాభాల కోసమే అంటూ, ఈ రెండు కంపెనీల ఈక్విటీలో కొంత వాటా కొనుగోలు చేసింది. తర్వాత బీవీ రాజు బంధువుల నుంచి మరింత వాటా కొనుగోలు చేసి ఈ రెండు సంస్థలను కైవసం చేసుకుంది. ఇండియా సిమెంట్ ఈక్విటీలో ఇప్పటికీ ప్రధాన ప్రమోటర్ ఎన్ శ్రీనివాసన్‌కు, ఆయన నిర్వహణలోని ఇన్వెస్ట్‌మెంట్ కంపెనీలకు 28 శాతం వాటా ఉంది. మిగతా 49 శాతం వాటా రిటైల్ మదుపరులు, సంస్థాగత మదుపరుల చేతుల్లో ఉంది.

జియో సేవలు మరింత ప్రియం

27% వరకు టారిఫ్‌ల పెంపు



జూలై 3 నుంచి అమల్లోకి

స్పెక్ట్రమ్ వేలం ముగిసిన మరునాడే వడ్డింపు

జియో బాటలో మిగతా టెల్కోలు!

న్యూఢిల్లీ: టెలికాం రంగంలో టారి్‌ఫల పెంపు మళ్లీ ప్రారంభమైంది. ముకేశ్ అంబానీ సారథ్యంలోని రిలయన్స్ జియో ఇందుకు నాంది పలికింది. తన ప్లాన్స్‌లోని అన్ని మొబైల్ టారిఫ్స్‌ను 12 నుంచి 27 శాతం వరకు పెంచుతున్నట్టు ప్రకటించింది. ఈ పెంపు జూలై 3వ తేదీ నుంచి అమల్లోకి వస్తుంది. రెండున్నర సంవత్సరాల తర్వాత జియో తన మొబైల్ టారిఫ్స్‌ను పెంచడం ఇదే మొదటిసారి. '5జీ, ఏఐ టెక్నాలజీల్లో పెట్టుబడుల ద్వారా స్థిరమైన అభివృద్ధి కోసం టారి్‌ఫలు పెంచుతున్నాం' అని రిలయన్స్ జియో ఇన్ఫోకామ్ చైర్మన్ ఆకాశ్ అంబానీ ఒక ప్రకటనలో తెలిపారు. అంతేకాకుండా అన్‌లిమిటెడ్ ఉచిత 5జీ సర్వీసులను కొన్ని ప్లాన్స్‌లోని కస్టమర్లకే కంపెనీ పరిమితం చేసింది. స్పెక్ట్రమ్ వేలం ముగిసిన మరుసటి రోజే రిలయన్స్ జియో టారి్‌ఫలు పెంచడం విశేషం. దీంతో మిగతా టెలికాం కంపెనీలు త్వరలోనే రిలయన్స్ జియోను అనుసరించే అవకాశం ఉందని భావిస్తున్నారు.

పెంపు ఇలా: ప్రస్తుతం రూ.15గా ఉన్న ఒక జీబీ డేటా యాడ్ ఆన్ ప్యాక్ ధరను రూ.19కు (27 శాతం) పెంచింది. 75 జీబీ పోస్ట్ పెయిడ్ డేటా ప్లాన్ టారిఫ్‌ను రూ.399 నుంచి రూ.449కి పెంచేసింది. ఇక అత్యంత ప్రజాదరణ పొందిన 84 రోజులు చెల్లుబాటయ్యే రూ.666 అన్‌లిమిటెడ్ ప్లాన్ టారిఫ్‌ను రూ.799కి (20 శాతం) పెంచేసింది. ఏడాది పాటు చెల్లుబాటయ్యే వార్షిక పథకాల టారిఫ్‌లనూ రూ.1,559 నుంచి రూ.1,899కి, రూ.2,999 నుంచి రూ.3,599కి పెంచింది. రోజుకి 2 జీబీ లేదా అంతకంటే ఎక్కువ జీబీ ప్లాన్స్‌లో ఉన్న ఖాతాదారులకు అపరిమిత 5జీ డేటా లభిస్తుందని తెలిపింది.

ఉచితంగా రెండు యాప్స్

టారి్‌ఫల పెంపుతో పాటు తన ఖాతాదారుల కోసం రిలయన్స్ జియో రెండు ప్రత్యేక యాప్స్‌ని అందుబాటులోకి తెచ్చింది. జియో సేఫ్, జియో ట్రాన్స్‌లేట్ అనే ఈ రెండు యాప్స్ ఏడాది పాటు జియో ప్రస్తుత ఖాతాదారులకు ఉచితంగా అందుబాటులో ఉంటాయి. ఇందులో జియో సేఫ్ యాప్ ద్వారా సురక్షితంగా కాల్స్, మెసేజ్‌లు, ఫైల్స్ ట్రాన్స్‌ఫర్‌తో సహా అనేక పనులు చేయవచ్చని తెలిపింది. ఇక కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత జియో ట్రాన్స్‌లేటర్ యాప్ ద్వారా వాయిస్ కాల్స్, వాయిస్ మెసేజ్‌లు, టెక్స్ట్, ఇమేజ్‌లను వివిధ భాషల్లోకి తర్జుమా చేయవచ్చు. కొత్తగా చేరే ఖాతాదారులు మాత్రం ఈ యాప్స్‌కి నెలకు రూ.99 నుంచి రూ.199 వరకు చెల్లించాలి.

2024-25లో ఫార్మా ఎగుమతుల్లో 10% వృద్ధి

రూ.2.6 లక్షల కోట్లుగా నమోదయ్యే చాన్స్

ఫార్మెక్సిల్ డైరెక్టర్ జనరల్ ఉదయ్ భాస్కర్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25)లో భారత్ నుంచి 3,100 కోట్ల డాలర్ల (దాదాపు రూ.2.6 లక్షల కోట్లు) ఫార్మా ఉత్పత్తులు ఎగుమతి కావచ్చని ఫార్మాస్యూటికల్ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఫార్మెక్సిల్) అంచనా వేస్తోంది. గత ఆర్థిక సంవత్సరం (2023-24)లో ఫార్మా ఎగుమతులు 2,785 కోట్ల డాలర్లు (రూ.2.32 కోట్లు)గా ఉన్నాయని, 2024-25లో ఇవి 10-12 శాతం వరకు వృద్ధిని నమోదు చేసే అవకాశం ఉందని భావిస్తున్నట్లు ఫార్మెక్సిల్ డైరెక్టర్ జనరల్ ఉదయ్ భాస్కర్ వెల్లడించారు. గురువారం నాడిక్కడ ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-మే నెలల కాలంలో ఫార్మా ఎగుమతులు 8.85 శాతం వృద్ధితో 435 కోట్ల డాలర్ల నుంచి 473 కోట్లకు పెరిగాయని తెలిపారు. ఎగుమతులపరంగా కొన్ని సవాళ్లు ఎదుర్కొంటున్నప్పటికీ నిర్దేశిత ఎగమతుల లక్ష్యాలను చేరుకుంటామని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

ఆఫ్ పేటెంట్ ఔషధాలతో అపార అవకాశాలు

2023 నుంచి 2029 వరకు అంతర్జాతీయంగా 15 బ్లాక్‌బస్టర్ ఔషధాల పేటెంట్ గడువు తీరిపోనుందని, ఈ ఔషధాలతో భారత ఫార్మా పరిశ్రమ అపారమైన అవకాశాలు దక్కించుకునే వీలుందని ఉదయ్ భాస్కర్ తెలిపారు. ఈ ఆఫ్-పేటెంటెడ్ ఔషధాల విలువ దాదాపు 11,200 కోట్ల డాలర్లుగా ఉందని, ఇందులో భారత కంపెనీలు 1,000 కోట్ల డాలర్ల వరకు అవకాశాలను అందుకునే అవకాశం ఉందన్నారు. కాగా ప్రస్తుతం దేశీయ ఫార్మా కంపెనీలు.. అంతర్జాతీయ రెగ్యులేటరీ సంస్థల నుంచి కొన్ని సవాళ్లు ఎదుర్కొంటున్నాయని, చాలా వరకు ఇవి నాణ్యతకు సంబంధించినవిగా ఉంటున్నాయని వివరించారు. అయితే ఈ సమస్యను అధిగమించేందుకు ఫార్మెక్సిల్ ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటోందని తెలిపారు.

నట్టేట ముంచే పెట్టుబడి సలహాదారులకు చెక్!

- సెబీ నియంత్రణలోకి ఫైనాన్షియల్ ఇన్‌ఫ్లుయెన్సర్స్
- అన్ రిజిస్టర్డ్ ఫిన్‌ఫ్లుయెన్సర్లకు కొత్త నియమావళి
- డెరివేటివ్స్‌లో స్టాక్స్ ఎంట్రీకి కఠిన నిబంధనలు
- సెబీ బోర్డులో పలు కీలక నిర్ణయాలు



ముంబై: డిజిటల్ మాధ్యమాల ద్వారా ఆర్థిక పెట్టుబడులపై సలహాలిచ్చే ఫైనాన్షియల్ ఇన్‌ఫ్లుయెన్సర్ల (ఫిన్‌ఫ్లుయెన్సర్స్)ను నియంత్రించాలని క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీ నిర్ణయించింది. అన్‌రిజిస్టర్డ్ ఫిన్‌ఫ్లుయెన్సర్స్ కోసం నియమావళిని విడుదల చేసింది. అన్ రిజిస్టర్డ్ ఫిన్‌ఫ్లుయెన్సర్స్‌తో సెబీ నమోదిత కంపెనీలు, వారి ఏజెంట్లు ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా భాగస్వాములు కాకుండా నిషేధం విధించింది. గురువారం సమావేశమైన సెబీ బోర్డు ఈ ప్రతిపాదనను ఆమోదించింది. పక్షపాతంతో, పక్కదోవ పట్టించే సలహాలిచ్చే ఫిన్‌ఫ్లుయెన్సర్స్‌తో ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో నియంత్రణ మండలి తాజా చర్యలు చేపట్టింది. ఎందుకంటే, పెట్టుబడులు, మదుపు కోసం ఫిన్‌ఫ్లుయెన్సర్ల సలహాలపై ఆధారపడే చిన్న మదుపరుల సంఖ్య గడిచిన కొన్నేళ్లలో భారీగా పెరిగింది. సెబీ కొత్త నియమావళి ఫిన్‌ఫ్లుయెన్సర్లను వారిచ్చే సలహాలకు బాధ్యులుగా, జవాబుదారీగా చేయనుంది. అంతేకాదు, సెబీ రిజిస్టర్డ్ ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్లు (ఐఏ), రీసెర్చ్ అనలిస్టులు (ఆర్ఏ) తమ క్లయింట్ల నుంచి రుసుము వసూలు చేసేందుకు క్లోజ్డ్ ఎకోసిస్టమ్‌ను ఏర్పాటు చేయాలని కూడా నియంత్రణ మండలి నిర్ణయించింది.

అప్పు చేసి ఎఫ్ అండ్ ఓ ట్రేడింగ్: బుచ్

ఏదైనా కంపెనీ షేరును డెరివేటివ్ ట్రేడింగ్‌లో చేర్చడం లేదా వైదొలగడానికి సంబంధించిన అర్హత నిబంధనలను సెబీ కఠినతరం చేసింది. నిత్యం తక్కువ టర్నోవర్ కలిగిన స్టాక్స్‌ను ఫ్యూచర్ అండ్ ఆప్షన్స్ (ఎఫ్ అండ్ ఓ) విభాగం నుంచి ఏరివేసేందుకు ఇది దోహదపడనుంది. అంతేకాదు, ఎఫ్ అండ్ ఓ విభాగ ట్రేడింగ్‌పై సమీక్ష జరిపేందుకు సెబీ 15 మంది సభ్యులతో కూడిన నిపుణుల బృందాన్ని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ మూడు కోణాల్లో (మార్కెట్ అభివృద్ధి, ఇన్వెస్టర్ల సొమ్ముకు రక్షణ, పొంచి ఉన్న ముప్పులు) ఎఫ్ అండ్ ఓ మార్కెట్‌ను సమీక్షించనుందని బోర్డు భేటీ అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సెబీ చీఫ్ మాధవి పురి బుచ్ తెలిపారు. ఎఫ్ అండ్ ఓ ట్రేడింగ్‌లో రిటైల్ ఇన్వెస్టర్ల పాత్ర పెరగడం ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపవచ్చన్నారు. చిన్న ఇన్వెస్టర్లు అప్పు చేసి మరీ ఎఫ్ అండ్ ఓలో ట్రేడింగ్ నెరుపుతున్నారని, కుటుంబ పొదుపు సొమ్మునూ కరిగించేస్తున్నారని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. ఇది ఏమాత్రం మంచిది కాదన్నారు.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	71,730 ▼	65,750 ▼	94,500 ▼
ముంబై	71,391 ▲	65,394 ▲	87,043 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



28వ తేదీ			
హైదరాబాద్	515	విజయవాడ	520
వరంగల్	517	గోదావరి	515
చిత్తూరు	573	విశాఖపట్నం	525
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	110	విజయవాడ	123
వరంగల్	110	గుంటూరు	123
కరీంనగర్	110	ఒంగోలు	123
మహబూబ్‌నగర్	110	చిత్తూరు	130
కర్నూలు	110	నెల్లూరు	130
విశాఖపట్నం	129	అనంతపురం	123
గోదావరి	123		

ఢిల్లీలోని ఒవైసీ ఇంటినేమ్ ప్లేట్‌పై సిరా చల్లి పారిపోయిన దుండగులు

» ఒవైసీ మండిపాటు.. అమిత్‌షా చేయిస్తున్నారని ఆరోపణ

హైదరాబాద్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మజ్లిస్ అధ్యక్షుడు, పార్లమెంటు సభ్యుడు అసదుద్దీన్ ఒవైసీకి చెందిన ఢిల్లీలోని ఇంటి ఆవరణలో ఉన్న నేమ్ ప్లేట్‌పై ఇద్దరు దుండగులు సిరా చల్లి పారిపోయారు. ఈ ఘటనకు సంబంధించి సీసీ కెమెరాలో రికార్డు అయిన దృశ్యాలను ఎక్స్‌లో పంచుకుంటూ ఒవైసీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి వాటిని నిరోధించడంలో ఢిల్లీ పోలీసుల విఫలం అయ్యారని మండిపడ్డారు. కేంద్ర హోం మంత్రి అమిత్‌షా పర్యవేక్షణలోనే ఇవి జరుగుతున్నాయని ఆరోపించారు. ఎంపీలకు తగిన భద్రత ఉంటుందో లేదో స్పష్టం చేయాలని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను ప్రశ్నించారు. ఇంటిపై సిరా చల్లడం, రాళ్లు రువ్వి పారిపోవడం పిరికిపందల చర్య అని, ఇలాంటి వాటికి తాను భయపడనని స్పష్టం చేశారు. ధైర్యం ఉంటే నేరుగా తనను ఎదుర్కోవాలని ఒవైసీ సవాల్ విసిరారు.

బియ్యం ఇచ్చేందుకు.. మిల్లర్లకు మరో 90 రోజుల సమయం

హైదరాబాద్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నుంచి ధాన్యం తీసుకుని బియ్యం(సీఎంఆర్) ఇవ్వని మిల్లర్లకు మరో 90 రోజుల పాటు గడువు ఇస్తూ సర్కారు నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు పౌర సరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ గురువారం జీవో జారీ చేశారు. ఈ పొడిగింపు 2019-20, 2020-21 యాసంగి సీజన్, 2021-22 వానాకాలం, యాసంగి, 2022-23 వానాకాలం సీజన్ సీఎంఆర్ బకాయిలకు వర్తిస్తుందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన సీఎంఆర్ ధరకు 125 శాతం లేదా 12 శాతం వార్షిక వడ్డీ రేటు.. ఇందులో ఏది ఎక్కువైతే అది నగదు రూపంలోనైనా, బియ్యం రూపంలో(స్టేట్ పూల్‌కు)నైనా రికవరీ చేయవచ్చని పేర్కొన్నారు. గడువులోగా ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తే మిల్లర్లపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు. మిల్లర్లకు ధాన్యం మిల్లింగ్‌కు అనుమతి ఇవ్వకుండా అనర్హత వేటు వేస్తామని స్పష్టం చేశారు. పౌర సరఫరాల శాఖ కమిషనర్, అన్ని జిల్లాల మేనేజర్లు, పౌర సరఫరాల సంస్థ అధికారుల సమన్వయంతో ఈ రికవరీ ప్రక్రియను పర్యవేక్షించనున్నారు.

నిబ్రస్ డ్రోన్లకు డీజీసీఏ ఆమోదం

» భూ సర్వే అవసరాలు తీర్చేలా ఆధునిక ఫీచర్లు



హైదరాబాద్ సిటీ, జూన్ 27(ఆంధ్రజ్యోతి): అధునాతన ఫీచర్లతో భూమి సర్వేకు నిబ్రస్ టెక్నాలజీస్ సంస్థ రూపొందించిన డ్రోన్ సర్వేయాన్ వి1కు డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) ఆమోద ముద్ర వేసింది. 1.99 కిలోల బరువుండే ఈ డ్రోన్‌కు అధిక తరంగ దైర్ఘ్యం (హై రెజుల్యూషన్) కలిగిన 23 మెగా పిక్సల్ కెమెరా అమర్చి ఉంటుంది. ఫలితంగా అత్యంత స్పష్టమైన చిత్రాలు, డేటాను సేకరించగలదు. గంటకు 25 కిలోమీటర్ల వేగంతో గాల్లో ఎగరగలదు. వేగంగా విస్తరిస్తున్న డ్రోన్ టెక్నాలజీ రంగంలో తమ ఉనికి చాటుకునేలా అధునాతన ఉత్పత్తులను రూపొందిస్తున్నట్లు నిబ్రస్ టెక్నాలజీస్ వ్యవస్థాపకుడు శుభం భరన్వాల్ తెలిపారు. సర్వే పరిశ్రమలో సర్వేయాన్ వీ1డ్రోన్ విప్లవాత్మక మార్పులకు కారణమవుతుందనే విశ్వాసం వ్యక్తంచేశారు.

ఆడపిల్ల వద్దంటూ..
ఏడో నెలలో అబార్షన్

తల్లి ప్రాణానికే ముప్పని వైద్యులు చెప్పినా వినని భర్త

» ఆర్ఎంపీ సహాయంతో భార్యకు మామిడితోటలో గర్భస్రావం చేయించి ఆమె ప్రాణాలు బలిగొన్న వైనం

» సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో విషాద ఘటన



సూర్యాపేట పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగిన సుహాసిని తల్లిదండ్రులు, బంధువులు



సుహాసిని (ఫైల్)

హుజూర్‌నగర్ / సూర్యాపేట క్రైం, జూన్ 27: భార్య కడుపులో పెరుగుతున్నది ఆడపిల్ల అని తెలిసి గర్భస్రావం చేయించేందుకు సిద్ధపడ్డాడా భర్త! ఏడో నెలలో అబార్షన్ చేస్తే తల్లిప్రాణాలకే ప్రమాదమని వైద్యులు హెచ్చరించినా అతడి మనసు మారలేదు! తెలిసిన ఆర్ఎంపీ సాయంతో.. ఓ వైద్యుణ్ని సంప్రదించి.. అతడి మామిడితోటలో దొంగచాటుగా అబార్షన్ చేయించాడు. ఈ క్రమంలో తీవ్ర రక్తస్రావమై ప్రాణాలు కోల్పోయిందా అభాగ్యురాలు!! సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో జరిగిందీ విషాదం. తమకు తెలియకుండా తమ కుమార్తెకు అల్లుడు ఆపరేషన్ చేయించడాన్ని ఆగ్రహిస్తూ తల్లిదండ్రులు గురువారం సూర్యాపేట పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విషయం వెలుగుచూసింది. మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం వెన్నారం గ్రామపంచాయతీ ఆవాసం రాముతండాకు చెందిన సుహాసిని(26)కి చివ్వెంల మండలం ఎంజీనగర్‌తండాకు చెందిన రత్నావత్ హరిసింగ్‌తో ఆరేళ్లక్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. హరిసింగ్ వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఏడాదిన్నర కిందట సుహాసిని గర్భవతి కాగా.. లింగనిర్ధారణ పరీక్ష చేయించాడు. ఆమె గర్భంలో ఉన్నది ఆడపిల్ల అని తెలియగానే అబార్షన్ చేయించాడు. ఇటీవల ఆమె మరోసారి గర్భం దాల్చడంతో మళ్లీ స్కానింగ్ తీయించాడు. కడుపులో ఉన్నది ఆడశిశువు అని నిర్ధారణ కావడంతో మరోసారి అబార్షన్ చేయించేందుకు జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లాడు. పరీక్షించిన వైద్యురాలు.. ఏడు నెలల గర్భం ఉన్న పరిస్థితుల్లో అబార్షన్ చేయడం వీలు పడదన్నారు. అయినప్పటికీ హరిసింగ్ ఊరుకోలేదు. ఓ ఆర్ఎంపీ సహాయంతో భార్య సుహాసినిని తీసుకుని హుజూర్‌నగర్‌లో ఓ ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లాడు. ఆమెకు అబార్షన్ చేసేందుకు ఓ వైద్యుడిని ఒప్పించారు. హుజూర్‌నగర్ పట్టణ సమీపంలో.. ఆ వైద్యుడికి చెందిన మామిడి తోటలో ఉన్న ఆపరేషన్ థియేటర్‌లో ఈ నెల 25వ తేదీన రాత్రిపూట సుహాసినికి అబార్షన్ చేస్తుండగా తీవ్ర రక్తస్రావమైంది. పరిస్థితి విషమిస్తుండటంతో ఆమెను తొలుత కోదాడలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ కూడా వైద్యులు పరిస్థితి బాగాలేదని చెప్పడంతో.. ఖమ్మం తీసుకెళ్లారు. అక్కడినుంచి తిరిగి సూర్యాపేటలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం రాత్రి ఆమె మృతి చెందింది. ఈ విషయాన్ని కుటుంబసభ్యులకు తెలపకుండా అదే రోజు మృతదేహాన్ని ఎంజీనగర్‌తండాకు తీసుకెళ్లాడామె భర్త.

కన్నీరుమున్నీరైన తల్లిదండ్రులు..

సుహాసిని మృతి విషయం తెలుసుకున్న ఆమె తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తూ ఎంజీనగర్ తండాకు వెళ్లారు. తమకు తెలియకుండా తమ కుమార్తెకు ఎలా ఆపరేషన్ చేయిస్తావంటూ అల్లుడితో గొడవపడ్డారు. ఆపరేషన్ చేసిన వైద్యుడిని నిలదీసేందుకు సుహాసిని తల్లిదండ్రులు, బంధువులు హుజూర్‌నగర్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్లారు. అక్కడ వైద్యుడు లేకపోవడంతో సిబ్బందితో గొడవపడ్డారు. సాయంత్రం ఐదు గంటల సమయంలో సూర్యాపేట పట్టణానికి వచ్చి స్థానిక ఏరియా ఆసుపత్రిలో సుహాసిని మృతదేహాన్ని ఉంచారు. అనంతరం.. సుహాసిని భర్తపైన, ఆపరేషన్ చేసిన వైద్యుడిపైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తే టౌన్ పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగారు. పోలీసులు వారి ఫిర్యాదు తీసుకుని.. బాధ్యులపై కఠినచర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఆ తర్వాత.. చట్టవిరుద్ధంగా అబార్షన్ చేసిన హుజూర్‌నగర్ వైద్యుడితో పాటు, ముగ్గురు ఆర్ఎంపీలు, ఆసుపత్రి అటెండర్లను పోలీసులు అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు.

'శ్రీశైలం'లో యూనిట్-4కు మరమ్మతులు!

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జెన్‌కో చర్యలు

త్వరలో టెండర్లు నిర్వహించేందుకు కసరత్తు

హైదరాబాద్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం ఎడమగట్టు జల విద్యుత్ కేంద్రంలోని 4వ యూనిట్‌కు మరమ్మతులు చేపట్టేందుకు జెన్‌కో చర్యలు చేపట్టింది. శ్రీశైలం విద్యుత్ కేంద్రంలో 150 మెగావాట్ల సామర్థ్యంతో కూడిన 6 యూనిట్లు ఉన్నాయి. 2020 ఆగస్టు 20న జలవిద్యుత్ కేంద్రంలో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకోగా.. తొమ్మిది మంది మృత్యువాత పడ్డారు. ప్రమాదంలో కొన్ని యూనిట్లు పూర్తిగా, మరికొన్ని యూనిట్లు పాక్షికంగా కాలిపోయాయి. 4వ యూనిట్‌కే అత్యధిక నష్టం వాటిల్లింది. దీనికి జర్మనీ కంపెనీ వైత్ ఆధ్వర్యంలో మరమ్మతులు చేశారు. గత ఏడాది జూలైలో 80 గంటలపాటు విద్యుదుత్పత్తి చేసిన తర్వాత ఫాల్ట్ రావడంతో 4వ యూనిట్ మళ్లీ కాలిపోయింది. డిఫెక్ట్ లయబిలిటీ పీరియడ్‌లోనే కాలిపోయినందున ఒప్పందం ప్రకారం సొంత ఖర్చుతో మరమ్మతు చేయాలని 'వైత్' గ్రూపును జెన్‌కో కోరగా, ఆ సంస్థ నిరాకరించింది. 4వ యూనిట్‌కు ఇతర మరమ్మతులు నిర్వహించడం వల్లే ఫాల్ట్ ఏర్పడిందని, తమకు సంబంధం లేదని స్పష్టం చేసింది. ఏడాదిపాటు ఈ వివాదం నడవడంతో మరమ్మతుల అంశం మరుగున పడిపోయింది. అయితే, ఈ విషయమై స్పందించిన రాష్ట్ర ప్రభుత్వం.. మరమ్మతులు చేపట్టాలని జెన్‌కోను ఆదేశించింది. మరమ్మతులకు రూ.3కోట్లు మాత్రమే ఖర్చు కానుండగా, అంతకు ఎన్నో రెట్లు విలువైన జల విద్యుత్తు ఉత్పత్తి చేసుకోవచ్చన్న అంశాన్ని ప్రస్తావించింది. దీంతో మళ్లీ కొత్తగా టెండర్లు నిర్వహించడానికి జెన్‌కో యాజమాన్యం సన్నాహాలు చేస్తోంది. అయితే, మరమ్మతులు పూర్తయి 4వ యూనిట్‌లో ఉత్పత్తి ప్రారంభం కావడానికి కనీసం మూడు నెలలు పడుతుందని, ఆలోగా కృష్ణాలో వరదలు తగ్గుముఖం పడుతాయని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

అమెరికాలో తెలుగోళ్ల హవా

» అగ్రరాజ్యంలో పెరుగుతున్న మనోళ్ల సంఖ్య

» 8 ఏళ్లలో నాలుగు రెట్ల పెరుగుదల

» 2016లో 3.2 లక్షలు.. 2024లో 12.3 లక్షలు

» ఆ దేశంలో ఎక్కువ మంది మాట్లాడే 350 విదేశీ భాషల్లో తెలుగుది 11వ స్థానం

హైదరాబాద్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ఇంట్లో తెలుగు.. వీధిలో తెలుగు.. యునివర్సిటీలో తెలుగు.. కార్యాలయంలోనూ తెలుగే.. ఇదేదో ఆంధ్రానో, తెలంగాణో అనుకుంటే పొరబడినట్టే! అగ్రరాజ్యం అమెరికాలోని కొన్ని ప్రాంతాల్లో ఇటీవలికాలంలో కనిపిస్తున్న పరిస్థితి ఇది. ఆ దేశంలో ఎక్కువ మంది మాట్లాడే 350 విదేశీ భాషల్లో తెలుగు 11వ స్థానంలో నిలిచింది. అమెరికాలో ఎక్కువగా మాట్లాడే భారతీయ భాషల జాబితాలో మనకన్నా ముందు హిందీ, గుజరాతీ ఉన్నాయి. కొన్నేళ్లుగా.. ఉన్నత విద్య, ఉపాధి కోసం ఇతర దేశాల నుంచి అమెరికాకు చేరుకుంటున్నవారిలో తెలుగువారి జనాభా గణనీయంగా పెరుగుతోంది. అమెరికా ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన గణాంకాలు ఈ విషయాన్ని అధికారికంగా స్పష్టం చేస్తున్నాయి. 2016తో పోలిస్తే 2024లో అమెరికాలో ఉంటున్న తెలుగువారి జనాభా నాలుగింతలు పెరిగిందని ఇటీవలే విడుదలైన యూఎస్ సెన్సస్ బ్యూరో డేటా చెబుతోంది. ఆ నివేదిక ప్రకారం..

- 2016లో అమెరికాలో తెలుగు మాట్లాడేవారి సంఖ్య 3.2 లక్షలు ఉండగా..ఇప్పుడది 12.3 లక్షలకు చేరింది.
- తెలుగు జనాభా ఎక్కువగా ఉన్న రాష్ట్రాల్లో క్యాలిఫోర్నియా ప్రథమస్థానంలో ఉంది. అక్కడ 2 లక్షల మంది తెలుగువారున్నారు. తర్వాతటెక్సస్(1.5 లక్షలు), న్యూజెర్సీ(1.1లక్షలు), ఇల్లినాయ్(83 వేలు), వర్జీనియా(78వేలు), జార్జియా(52 వేలు) ఉన్నాయి.
- అమెరికాకు ఏటా వచ్చే మొత్తం విదేశీ విద్యార్థుల్లో తెలుగు విద్యార్థుల వాటా దాదాపు 13 శాతం.
- ఉపాధి కోసం వెళ్లేవారి సంఖ్యలోనూ ఏటా వృద్ధి నమోదవుతోంది. ఇతర దేశాలతో పోలిస్తే భారత్ నుంచి అత్యధికులు అమెరికాకు వెళ్తుండగా.. వీరిలో సింహభాగం తెలుగు రాష్ట్రాల నుంచే ఉంటున్నారు.
- అమెరికాలోని అనేక ప్రముఖ వర్సిటీల్లోని విదేశీ విద్యార్థుల్లో తెలుగు రాష్ట్రాల విద్యార్థుల వాటా పెరుగుతోంది. కెంట్ స్టేట్ వర్సిటీలో మనోళ్ల ప్రవేశాలు ఎక్కువగా ఉండడంతో 'విద్యార్థులకు స్వాగతం' అంటూ తెలుగులో ఆహ్వానం పలకడం పట్ల మన విద్యార్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.
- ఏటా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ నుంచి 60 వేల నుంచి 70 వేల మంది విద్యార్థులు, 10 వేల మందికి పైగా హెచ్1బీ వీసాపై అమెరికాకు చేరుకోవడమే అక్కడ మన హవా ఇంతగా పెరడగానికి ప్రధాన కారణం. ఇండియన్ మొబిలిటీ రిపోర్ట్-2024 ప్రకారం.. చదువుకోవడానికి అమెరికా వెళ్తున్న భారతీయ విద్యార్థుల్లో మన తెలుగువారి వాటా ఏకంగా 12.5 శాతం!!

మాతృ భాష	2010	2021	వృద్ధి (శాతం)
తెలుగు	217641	459836	111.00%
తమిళం	181698	341396	88.00%
బెంగాలీ	221872	403024	82.00%
నేపాలీ, మరాఠీ, ఇండో-ఆర్యన్ భాషలు	275694	447811	63.00%
హిందీ	609395	864830	42.00%
మళయాళం, కన్నడ, ఇతర ద్రావిడ భాషలు	197550	280188	42.00%
ఉర్దూ	388909	507972	31.00%
పంజాబీ	243773	318588	31.00%
గుజరాతీ	356394	436909	23.00%

వృద్ధిరేటులో మనమే..

అమెరికాలో ఉండే అన్ని దేశాలవారు, జాతులవారు బయట మాట్లాడేది ఆంగ్లమైనా.. ఇంట్లో మాట్లాడేది మాత్రం మాతృభాషే. అలా ఆ దేశంలో ఉంటున్న భారతీయుల్లో.. ఇంట్లో మాతృభాష మాట్లాడే వారి సంఖ్య పెరుగుదలలో తెలుగువారిదే అగ్రస్థానం. 2010లో అక్కడ 2.17 లక్షల మంది ఇంట్లో తెలుగు మాట్లాడుతుండగా.. 2021 నాటికి వారి సంఖ్య 111 శాతం వృద్ధి రేటుతో 4.59 లక్షలకు చేరింది

గర్భస్థ శిశు లింగ నిర్ధారణ నేరం

● జిల్లా మహిళా సాధికారత కేంద్రం

కో ఆర్డినేటర్ పల్లవి

సంగారెడ్డి అర్బన్, జూన్ 27: గర్భస్థ శిశు లింగ నిర్ధారణ నేరమని జిల్లా మహిళా సాధికారత కేంద్రం కో ఆర్డినేటర్ పల్లవి అన్నారు. జిల్లా మహిళా శిశు సంక్షేమశాఖ, మహిళా సాధికారత కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో బేటీ బచావ్-బేటీ పడావ్ కార్యక్రమంలో భాగంగా సంగారెడ్డిలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో పీసీపీఎన్‌డీటీ(ప్రీ కాన్సెప్షన్ అండ్ ప్రీ నెటల్ డయాగ్నోస్టిక్ టెక్నిక్స్) యాక్ట్‌పై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పల్లవి మాట్లాడుతూ భ్రూణ హత్యలు అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని వివరించారు. అనంతరం పీసీపీఎన్‌డీటీ యాక్ట్‌కు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సునీత, ఎస్ఐ నాగలక్ష్మి, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీరాం సుధాకర్, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

మట్టి తరలిస్తున్న ఎక్స్‌కవేటర్ పట్టివేత

మనోహరాబాద్, జూన్ 27: మట్టి తరలింపునకు ఉపయోగిస్తున్న ఎక్స్‌కవేటర్‌ను రెవెన్యూ సిబ్బంది పట్టుకున్నారు. మనోహరాబాద్ మండలం పర్కిబండ గ్రామంలోని సర్వే నెంబరు 209లో మట్టిని అక్రమంగా తరలిస్తున్నారన్న సమాచారం మేరకు రెవెన్యూ సిబ్బంది వెళ్లారు. ఈ క్రమంలో మట్టి తరలింపుదారులు ట్రాక్టర్లతో పారిపోతుండగా సిబ్బంది పట్టుకునే ప్రయత్నం చేశారు. దీంతో పర్కిబండ గ్రామానికి చెందిన పిట్ల కృష్ణ, కుమ్మరి నాగేష్ రెవెన్యూ సిబ్బందిపై దాడిచేసేందుకు యత్నించారన్నారు. దీంతో తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి గురువారం రెవెన్యూ సిబ్బందిపై దాడికి యత్నించిన వారిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సదాశివపేట అభివృద్ధి బాధ్యత నాదే

● నిలిచిపోయిన పనులను ముందుకు తీసుకెళ్తా

● మున్సిపల్ సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

సదాశివపేట, జూన్ 27: సదాశివపేట పట్టణ అభివృద్ధి బాధ్యత ఎమ్మెల్యేగా తనపై ఉన్నదని, పట్టణంలో నిలిచిపోయిన అభివృద్ధి పనులను ముందుకు తీసుకెళ్లడంతో పాటు పట్టణంలోని 26 వార్డుల్లో అవసరమైన మౌలిక సౌకర్యాల కోసం ప్రభుత్వం ద్వారా నిధులు మంజూరు చేయిస్తానని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ తెలిపారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో చైర్‌పర్సన్ అపర్ణ శివరాజ్‌పాటిల్ అధ్యక్షతన నిర్వహించిన సాధారణ సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పట్టణాభివృద్ధి కోసం మంజూరైన (టీయూఎఫ్ఐడీసీ) నిధులు రూ.20 కోట్లతో చేపట్టే అభివృద్ధి పనులకు టెండర్లు పిలిచి పనులు ప్రారంభించాలని కలెక్టర్‌తో తాను మాట్లాడానని, కలెక్టర్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని గుర్తుచేశారు. అదేవిధంగా మాజీ సీఎం కేసీఆర్ (స్పెషల్ డెవలప్‌మెంట్ నిధుల) ద్వారా సదాశివపేటకు మంజూరుచేసిన రూ.25కోట్ల నుంచి రూ.11 కోట్ల నిధులతో పట్టణంలో 26 వార్డుల్లో అభివృద్ధి చేసుకున్నామని పేర్కొన్నారు. మిగిలిన రూ.14 కోట్ల పనులను కూడా పూర్తి చేయించే బాధ్యత తనదేనని హామీఇచ్చారు. ప్రస్తుత కౌన్సిలర్లు అందరికీ ప్రజల్లో మంచి పేరు ఉందని, ఇప్పుడున్న కౌన్సిలర్లు రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో మళ్లీ గెలవాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. కాగా సమావేశంలో కౌన్సిలర్లు బల్దియాలోని రెవెన్యూ, టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్ విభాగాల్లో జరుగుతున్న అవినీతి-అక్రమాలపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. కౌన్సిలర్ ఇలియాజ్ షరీఫ్ మాట్లాడుతూ పట్టణంలో ప్లాస్టిక్ నిషేధమంటూ అధికారులు వీధి, చిరు వ్యాపారులపై ప్రతాపం చూపుతూ రూ.లక్షల్లో జరిమానాలు విధిస్తున్నారన్నారు. కో-ఆప్షన్ సభ్యుడు కోదూరి అంజయ్య మాట్లాడుతూ చనిపోయిన వ్యక్తి పేరుపై రెవెన్యూ విభాగం అధికారులు ఆస్తి మార్పిడి చేశారని ఆరోపించారు. కౌన్సిలర్ ఖుద్దుస్ ఖురేషీ మాట్లాడుతూ పట్టణంలో 65వ నెంబర్ జాతీయ రహదారిని కబ్జాచేసి ఓ బిల్డర్ నిర్మించిన 30 దుకాణాల భారీ వాణిజ్య భవన సముదాయానికి అధికారులు ఆస్తి పన్ను ఎందుకు విధించడం లేదని నిలదీశారు. వీరేకాకుండా మిగతా కౌన్సిలర్లు కూడా మాట్లాడుతూ తమ పరిధిలోని సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్ చింతా గోపాల్, కమిషనర్ ఉమా తదితరులు పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డి, దీపాదాస్ మున్షీలను కలిసిన ఎంపీ


సీఎం రేవంత్‌రెడ్డితో ఎంపీ కుటుంబసభ్యులు

నారాయణఖేడ్, జూన్ 27: ఢిల్లీలో సీఎం రేవంత్‌రెడ్డి, తెలంగాణ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీలను జహీరాబాద్ ఎంపీ సురేష్‌షెట్కార్, ఆయన భార్య ఉమాదేవి, కుమారుడు, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాకేశ్‌షెట్కార్, ఏఐసీసీ స్పోక్స్‌పర్సన్ కూతురు గిరిజాషెట్కార్, కూతురు శివాణి, టీపీసీసీ సభ్యులు కర్నె శ్రీనివాస్ బుధవారం రాత్రి కలిశారు.

తుక్కాపూర్‌లో వ్యక్తి అదృశ్యం


అయిలి రవి (ఫైల్)

కొల్చారం, జూన్ 27: ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన కొల్చారం మండలం తుక్కాపూర్ గ్రామంలో చోటు చేసుకున్నది. గ్రామానికి చెందిన అయిలి రవి(38) ఆరునెలల క్రితం ఇంట్లోంచి వెళ్లి తిరిగిరాలేదు. అప్పటి నుంచి కుటుంబీకులు బంధువుల, తెలిసిన వారి వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో భార్య లక్ష్మి గురువారం కొల్చారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మహ్మద్‌గౌస్ తెలిపారు.

కాంట్రాక్టు కార్మికుల వేతనాలు పెంచాలి

● సీఐటీయూ జిల్లా కార్యదర్శి మైపాల్

జహీరాబాద్, జూన్ 27: జహీరాబాద్ మున్సిపాలిటీలో ఏళ్ల తరబడి పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల వేతనాలను పెంచాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి మైపాల్ పేర్కొన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట కాంట్రాక్టు కార్మికులు గురువారం నిర్వహించిన ఆందోళనలో పాల్గొని మాట్లాడారు. ప్రస్తుతం కార్మికులకు నెలకు రూ.21వేలు ఇస్తున్నారన్నారు. వాటికి అదనంగా మరో రూ.5వేలు పెంచి రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు, కార్మికులు కామయ్య, యశోదమ్మ, మోహన్, సంజీవ్ పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి


పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో పుస్తకాలు, యూనిఫాం

జహీరాబాద్, జూన్ 27: జహీరాబాద్ ప్రాంతంలో ప్రైవేటు విద్యాసంస్థల ఆగడాలు ఎక్కువయ్యాయని, చర్యలు తీసుకోవడంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారంటూ ఏబీవీపీ మెదక్ విభాగ్ హాస్టల్ కన్వీనర్ ప్రవీణ్ తదితరులు పేర్కొన్నారు. ఏబీవీపీ ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని పలు పాఠశాల లను తనిఖీ చేసి మాట్లాడారు. ఈ అక్రమ వ్యాపారానికి చెక్‌పెట్టడంలో విద్యాశాఖ అధికారులు విఫలమౌతున్నారని ఆయన ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు శ్రీకాంత్, అరవింద్, నాని పాల్గొన్నారు.

పోలీసులు బంగారం తనిఖీలు చేస్తున్నారంటూ మోసం

● మూడు తులాల బంగారం గొలుసు కాజేసిన ప్రబుద్ధుడు


మోసానికి గురైన వీరయ్య

తూప్రాన్, జూన్ 27: బంగారు ఆభరణాలను పోలీసులు తనిఖీలు చేస్తున్నారని వృద్ధుడిని మాయమాటలతో మభ్యపెట్టి మూడు తులాల బంగారు గొలుసును గుర్తు తెలియని వ్యక్తి కాజేశాడు. ఈ సంఘటన మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణంలో గురువారం మధ్యాహ్నం చోటు చేసుకున్నది. తూప్రాన్ మండలం కోనాయపల్లి(పీబీ) గ్రామానికి చెందిన నర్ర వీరయ్య(72) అల్లం, ఎల్లిగడ్డ వ్యాపారం చేస్తుంటాడు. బంగారం, వెండి అంటే వీరయ్యకు ప్రీతి. వీరయ్య చేతులకు బంగారు, వెండి ఉంగారాలు, మెడలో బంగారు గొలుసు చేయించుకున్నాడు. గురువారం మధ్యాహ్నం హైదరాబాద్ వ్యాపారానికి వెళ్లి ఇమాంపూర్‌లో ఉన్న కూతురు వద్దకు వెళ్లేందుకు తూప్రాన్‌కు వచ్చాడు. హోటల్‌లో భోజనం చేసి బ్యాగు కొనుగోలు చేసేందుకు బజారుకు బయలుదేరాడు. మున్సిపల్ కార్యాలయం వద్దకు రాగానే గుర్తు తెలియని వ్యక్తి వీరయ్య వద్దకు వచ్చి పోలీసులు బంగారం తనిఖీలు చేస్తున్నారని భయపెట్టాడు. మెడలో ఉన్న 3 తులాల బంగారు గొలుసు తీసుకొని దాచుకోవాలంటూ నమ్మించాడు. గొలుసు తీసి బ్యాగులో వేయడానికి ప్రయత్నించగా, అలా వేయొద్దంటూ ఓ పేపర్‌లో పొట్లం కట్టాలని చూపించాడు. పేపర్ బ్యాగులో వేసినట్లుగా నమ్మించి, అతడి వద్ద పేపర్‌లో రాళ్లు కట్టిన పొట్లం బ్యాగులో వేశాడు. కూతురు ఇంటికి వెళ్లిన వీరయ్య పొట్లంలో రాళ్లు ఉండటం చూసి మోసపోయినట్లు గుర్తించాడు. రాత్రి పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేశాడు.

మానవత్వం చాటుకున్న జోగిపేట సీఐ

పుల్‌కల్, జూన్ 27: చౌటకూర్ మండలం శివంపేట గ్రామ శివారులో మూలమలుపు వద్ద గురువారం సంగారెడ్డి-నాందేడ్, అకోలా 161వ జాతీయ రహదారిపై ఎదురెదురుగా వెళ్తున్న బైక్‌లు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో జీడిమెట్ల ప్రాంతానికి చెందిన ఇద్దరికి, మండలంలోని వెండికోలు గ్రామానికి చెందిన బీరు పరిశ్రమ కాంట్రాక్టు కార్మికుడికి తీవ్రగాయాలయ్యాయి. అదే రూట్లో తన వాహనంలో సంగారెడ్డికి వెళ్తున్న జోగిపేట సీఐ అనిల్‌కుమార్ గమనించి వారి వివరాలు తెలుసుకుని, ఎన్‌హెచ్ఏఐకు చెందిన అంబులెన్స్‌లో క్షతగాత్రులను ఎక్కించి సంగారెడ్డి ప్రభుత్వాస్పత్రికి తరలించి మానవత్వం చాటుకున్నారు.

'రెగ్యులర్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులను నియమించాలి'

నారాయణఖేడ్, జూన్ 27: నారాయణఖేడ్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో రెగ్యులర్ ప్రిన్సిపాల్, అధ్యాపకులను నియమించాలని పేరెంట్స్ కమిటీ డిమాండ్ చేసింది. ఈమేరకు గురువారం పేరెంట్స్ కమిటీ చైర్మన్ రాజు, సభ్యులు నర్సాపూర్ శంకర్, నర్సింహులు ఇస్నాపూర్‌లోని ఆర్సీఓ భీమయ్యకు వినతి పత్రం అందజేశారు. రెగ్యులర్ ప్రిన్సిపాల్, అధ్యాపకులను నియమిస్తానంటు ఆర్సీఓ భీమయ్య హామీ ఇచ్చినట్లు తెలిపారు. అలాగే విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తానంటు హామీ ఇచ్చినట్లు వివరించారు.

వాసవీ క్లబ్స్ ఆధ్వర్యంలో వాటర్ ట్యాంకుల బహుకరణ

సంగారెడ్డి అర్బన్, జూన్ 27: వాసవీ క్లబ్స్ ఇంటర్నేషనల్ ఆదేశాల మేరకు సంగారెడ్డి పట్టణంలో డూన్ టు డస్క్ కార్యక్రమంలో భాగంగా పలు ఆలయాలకు వాటర్ ట్యాంకులు గురువారం బహుకరించారు. వాసవీ క్లబ్ సంగారెడ్డి, వనిత క్లబ్ సంగారెడ్డి, యూత్ క్లబ్ సంగారెడ్డి సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక విద్యానగర్‌లోని హనుమాన్, సాయిబాబా, వాసవీమాత ఆలయాలకు ఒక్కొక్కటి చొప్పున వాటర్ ట్యాంకులు బహుకరించారు.

సమాచారం

అంబులెన్సు తనిఖీ

కంగ్టి: మండలంలోని 108 అంబులెన్స్‌ను గురువారం ఉమ్మడి జిల్లా ప్రోగ్రాం మేనేజర్ జనార్దన్, జిల్లా మేనేజర్ హుస్సేన్ తనిఖీ చేశారు. అత్యవసర పరిస్థితులలో వీలైంత తొందరగా సంఘటనా స్థలానికి చేరుకోవాలని సూచించారు. వాహనం పని తీరును ఎప్పటికప్పుడు పరీక్షించుకోవాలన్నారు.

జీలుగ, పచ్చిరొట్టతో సాగుభూమికి బలం: ఏడీ

నర్సాపూర్: పంట భూముల్లో జీలుగ, పచ్చిరొట్ట వేయడం వల్ల భూములు మరింత సారవంతంగా మారి, పంట దిగుబడి పెరుగుతుందని నర్సాపూర్ వ్యవసాయ శాఖ ఏడీ సంధ్యారాణి పేర్కొన్నారు. గురువారం మండలంలోని రుస్తుంపేట సమీపంలో జీలుగ పొలంలో వేసిన పంటలను పరిశీలించి మాట్లాడారు.

'పత్తి మొలకలు సరిగ్గా లేకపోతే మళ్లీ విత్తుకోవాలి'

చిలప్‌చెడ్: పత్తి పంటలో మొలకలు సరిగ్గా మొలవని ప్రదేశంలో వర్షం పడిన తర్వాత మళ్లీ విత్తుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్ సూచించారు. గురువారం మండల పరిధిలోని సిలాంపల్లి గ్రామంలో పత్తి పంటను క్షేత్రస్థాయిలో పరిశీలించి మాట్లాడారు.

భక్తిశ్రద్ధలతో వరుణ హోమం

సంగారెడ్డి అర్బన్: సంగారెడ్డి శివారులోని శ్రీవైకుంఠపురం ఆలయంలో వరుణ హోమం గురువారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మంత్రి దామోదర రాజనర్సింహ సతీమణి పద్మిణి హోమంలో పాల్గొన్నారు.

'మొక్కలు నాటి సంరక్షించాలి'

జిన్నారం: పర్యావరణ సంరక్షణకు మొక్కలు నాటి సంరక్షించాలని మాజీ సర్పంచ్ ప్రకాశంచారి అన్నారు. పర్యావరణ దినోత్సవం సందర్భంగా గడ్డపోతారం, కిష్టాయ్యపల్లి సమీపంలోని గందం మొక్కల పార్కులో వివేకానంద పాఠశాల విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు.

బీమా చెక్కుల అందజేత

తూప్రాన్: తూప్రాన్ మండలం కిష్టాపూర్‌కు చెందిన బీఆర్ఎస్ కార్యకర్తలు పిట్ల బాలేష్, పిట్ల వెంకటేశ్ ప్రమాదవశాత్తు నీట మునిగి చనిపోయారు. పార్టీ బీమా ఒక్కొక్కరికి రూ.2 లక్షల వంతున రూ.4 లక్షలు మంజూరయ్యాయి. బీమా చెక్కులు కుటుంబీకులు పిట్ల మౌనిక, పిట్ల మంగమ్మలకు ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అందజేశారు.

కేజీబీవీలో విద్యార్థిని చేరిక

కొల్చారం: కొల్చారం మండలం అప్పాజిపల్లి గ్రామానికి చెందిన విద్యార్థిని మహేశ్వరి అప్పాజిపల్లి మండల పరిషత్ ఉన్నత పాఠశాలలో గతేడాది 8వ తరగతి అర్ధాంతరంగా మానేసింది. గురువారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీనర్సమ్మ ఆధ్వర్యంలో మహేశ్వరి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. అలాగే కొల్చారంలోని కేజీబీవీ ప్రిన్సిపాల్‌తో మాట్లాడి తొమ్మిదవ తరగతిలో అడ్మిషన్ ఇప్పించారు.

ఉపాధిహామీ పనుల అవకతవకలపై ఎమ్మెల్యే ఆగ్రహం

● పనులు చేయని వారి ఖాతాల్లో డబ్బులు జమ



సమావేశంలో ఈజీఎస్ ఈసీపై ఆగ్రహం వ్యక్తం వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

కల్హేర్, జూన్ 27: మండల పరిధిలోని కొన్ని గ్రామాల్లో ఈజీఎస్ పనులకు కూలీలు వెళ్లకున్నా వారి ఖాతాల్లో డబ్బులు జమ అవుతుండటంతో ఈజీఎస్ సిబ్బందిపై నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ఎంపీపీ గుర్రపు సుశీల అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఎమ్మెల్యే సంజీవరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మండలంలోని వివిధ గ్రామాల్లో ఈజీఎస్ పనులకు హాజరు కాని కూలీల ఖాతాల్లో ఈజీఎస్ సిబ్బంది డబ్బులు వేస్తున్నారని సభలో పాల్గొన్న వారు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. పనులు చేయకున్నా డబ్బులు ఎలా వేస్తారని ఈజీఎస్ ఈసీపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్ని గ్రామాల్లో విచారణ జరిపి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో శ్రీనివాస్‌ను ఎమ్మెల్యే ఆదేశించారు. మిషన్ భగీరథ నీరు రావడం లేదని సభ్యులు సభ దృష్టికి తీసుకురాగా ఖేడ్ నియోజకవర్గంలో 40 శాతం గ్రామాలకు మంచి నీరు అందడం లేదని, వందల కోట్లు ఖర్చుచేసిన మిషన్ భగీరథ విఫలమైన పథకమని ఎమ్మెల్యే అన్నారు. నేటికీ పాత మంచినీటి పథకాలే గ్రామాల్లో దిక్కయ్యాయని పేర్కొన్నారు. ప్రభుత్వ, అటవీ భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. అంతకుముందు ఈజీఎస్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కల్హేర్ జడ్పీటీసీ నర్సింహారెడ్డి, వైస్ ఎంపీపీ నారాయణరెడ్డి, జడ్పీ, మండల కోఆప్షన్ సభ్యుడు ఎండీ.అలీ, ఎండీ.ఘని పాల్గొన్నారు. అనంతరం పదవీ కాలం ముగించుకుంటున్న ఎంపీపీ, జడ్పీటీసీ, ఎంపీటీసీలను ఎమ్మెల్యే సంజీవరెడ్డి సన్మానించారు.

కేసీఆర్‌ను కలిసిన జడ్పీ చైర్‌పర్సన్ దంపతులు


కేసీఆర్‌తో జడ్పీ చైర్‌పర్సన్ దంపతులు

మనోహరాబాద్, జూన్ 27: మెదక్ జడ్పీ చైర్‌పర్సన్ హేమలతాశేఖర్‌గౌడ్ దంపతులు గురువారం మాజీ సీఎం కేసీఆర్‌ను గజ్వేల్‌లోని ఆయన ఫాంహౌస్‌లో ఉద్యమకారులు, బీఆర్ఎస్ శ్రేణులతో కలిశారు. అనంతరం కేసీఆర్ పార్టీ స్థితిగతులను జడ్పీ చైర్‌పర్సన్‌కు వివరించారు. వారి వెంట ఉద్యమకారులు మాంగ్యానాయక్, బొల్లిని పాండు, రతన్‌లాల్, భిక్షపతి, మహేందర్‌గౌడ్, వెంకటేష్, పార్టీ సీనియర్ నాయకులు ఉన్నారు.

ఇంటి నిర్మాణ పనులను నిలిపివేయాలి

● అదనపు కలెక్టర్‌కు బాధితుడి ఫిర్యాదు

మెదక్ అర్బన్, జూన్ 28: అనుమతి లేకుండా అక్రమంగా నిర్మిస్తున్న ఇంటి నిర్మాణ పనులను నిలిపివేసి న్యాయం చేయాలని బాధితుడు భిక్షపతి గురువారం అదనపు కలెక్టర్ వేంకటేశ్వర్లుకు ఫిర్యాదు చేశాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పట్టణంలోని ఫతేనగర్‌లో తమ ఇంటిని అనుకొని ఉన్న సొంత స్థలాన్ని ఆక్రమించి సున్నం రాంచందర్ మున్సిపాలిటీ నుంచి అనుమతి లేకుండా ఇంటి నిర్మాణ పనులు చేస్తున్నాడన్నారు. ఈ విషయం మున్సిపల్ కమిషనర్, టౌన్‌ప్లానింగ్ అధికారికి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. నెలరోజుల నుంచి మున్సిపల్ కార్యాలయానికి తిరుగుతున్నా చర్యలు తీసుకోలేదన్నారు. వెంటనే నిర్మాణ పనులను నిలిపివేసి న్యాయం చేయాలని, మున్సిపల్ అధికారులపై చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్‌ను కోరినట్లు తెలిపాడు.

నారాయణఖేడ్ ఆస్పత్రి సిబ్బందిపై పనితీరుపై విచారణ

● హాజరుపై కచ్చితత్వం కోసం బయోమెట్రిక్

● డీసీహెచ్ఎస్ డాక్టర్ సంగారెడ్డి


ఖేడ్ ఆస్పత్రిలో విచారణ జరుపుతున్న డీసీహెచ్ఎస్ డాక్టర్ సంగారెడ్డి

నారాయణఖేడ్, జూన్ 27: వైద్యులు, సిబ్బంది డుమ్మాలు కొడుతూ ఇష్టానుసారంగా విధులు నిర్వహిస్తున్న నారాయణఖేడ్ ఏరియా ఆస్పత్రిపై జిల్లా వైద్య విధాన పరిషత్తు ఆస్పత్రుల సమన్వయకర్త (డీసీహెచ్ఎస్) డాక్టర్ సంగారెడ్డి గురువారం విచారణ జరిపారు. ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి బుధవారం ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేయగా వైద్యులు, సిబ్బంది డుమ్మాలు కొట్టడం, విధుల పట్ల నిర్లక్ష్యం బయట పడింది. దీంతో స్పందించిన డాక్టర్ సంగారెడ్డి ఆస్పత్రిలో విభాగాల వారీగా విచారణ జరిపారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ అంశాలవారీగా విచారణ జరుపుతున్నట్లు చెప్పారు. డెలివరీ రోగులను ఇతర ప్రైవేటు ఆస్పత్రులకు రెఫర్ చేయడం, వైద్యులు, సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం, గైర్హాజరు తదితర అంశాలపై కలెక్టర్‌కు నివేదిక సమర్పిస్తామని పేర్కొన్నారు. ఆస్పత్రిలో ఈరోజు నుంచే బయోమెట్రిక్‌ను అమలు చేస్తున్నామని, బయోమెట్రిక్ హాజరు అనుగుణంగానే వేతనాలు చెల్లించనున్నట్లు వెల్లడించారు. పలు పీహెచ్‌సీల్లో సిబ్బంది కొరత ఉన్నందున ఎమ్మెల్యే ఆదేశాల మేరకు ల్యాబ్ టెక్నీషియన్ రమేష్‌ను సిర్గాపూర్ పీహెచ్‌సీకి, ఫార్మాసిస్టు నాగ్‌నాథ్‌ను నిజాంపేట పీహెచ్‌సీకి డిప్యూటేషన్ చేసినట్లు డీసీహెచ్ఎస్ తెలిపారు. ఇందులో ఆస్పత్రి సూపరింటెండెంట్ వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

తూప్రాన్‌లో నూతన కోర్టుకు భవన పరిశీలన

తూప్రాన్, జూన్ 27: తూప్రాన్ పట్టణానికి నూతనంగా మంజూరైన జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏర్పాటుకు గురువారం భవనాన్ని పరిశీలించారు. తూప్రాన్ పట్టణానికి మార్చి 14న జూనియర్ సివిల్ జడ్జి కమ్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ద ఫస్ట్ క్లాస్ కోర్టు మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి తిరుపతి ఆదేశాలు జారీచేశారు. గురువారం తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి ఆధ్వర్యంలో పుట్టకోటలోని పాత హాస్టల్ భవనాన్ని పరిశీలించారు. కోర్టు ఏర్పాటుకు తాత్కాలిక భవనంగా హాస్టల్ భవనం అనుకూలంగా ఉన్నదని ఆర్డీవో జయచంద్రారెడ్డి పేర్కొన్నారు. శనివారం జిల్లా న్యాయాధికారి పరిశీలన అనంతరం తుది నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిపారు. విశాలమైన కోర్టు భవనం నిర్మాణం చేసేందుకు ఐదెకరాల స్థలం కేటాయించనున్నట్లు వివరించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ జ్యోతికృష్ణ, వైస్ చైర్మన్ నందాల శ్రీనివాస్, తహసీల్దార్ విజయలక్ష్మి, కమిషనర్ ఖాజా మొహియుద్దీన్, ఎస్ఐ శివానందం, కౌన్సిలర్లు, పీఆర్ ఇంజనీర్ మధుసూదన్ పాల్గొన్నారు.

మట్టి అక్రమ రవాణాపై ఫిర్యాదు చేసినా స్పందన కరువు

● నీటిపారుదల శాఖ జిల్లా ఈఈ శ్రీనివాస్‌రావు

నర్సాపూర్, జూన్ 27: నర్సాపూర్ డివిజన్ పరిధిలో పలు గ్రామాల్లో చెరువులు, కుంటల నుంచి మట్టిని అక్రమంగా తరలిస్తున్న విషయమై పోలీసులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదులు చేసినా స్పందించడం లేదని నీటి పారుదల శాఖ ఈఈ శ్రీనివాస్‌రావు పేర్కొన్నారు. గురువారం నర్సాపూర్ నీటిపారుల శాఖ డీఈఈ కార్యాలయాన్ని సందర్శించిన సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. శివ్వంపేట మండలంలోని పలు గ్రామాల నుంచి అనుమతులు లేకుండా చెరువుల నుంచి మట్టిని కొన్నిరోజులుగా తరలిస్తున్నారని ఫిర్యాదులు వచ్చాయన్నారు. ఆ ఫిర్యాదుల మేరకు అక్కడి పోలీసులకు ఏకంగా డీఈఈ లిఖితపూర్వకంగా ఫిర్యాదుచేసినా తీసుకున్న చర్యలపై సమాచారం ఇవ్వడం లేదని, దీంతో తాము ఏమీ చేయలేకపోతున్నామని పేర్కొన్నారు. చిన్నచింతకుంట పరిధిలోని చెరువు కట్ట దెబ్బతినగా చేపట్టిన తాత్కాలిక మరమ్మతు పనులను ఆయన పరిశీలించారు. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాగానే పూర్తిస్థాయిలో బాగుచేస్తామని ఈఈ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీఈఈ బుజ్జిబాబు, ఏఈ మణిభూషణ్ పాల్గొన్నారు.

తాగునీటి ప్రాజెక్టులను గాలికి వదిలేస్తున్న పాలకులు

నారాయణఖేడ్, జూన్ 27: నారాయణఖేడ్ నియోజకవర్గంలోని సాగునీటి ప్రాజెక్టులను కాంగ్రెస్ పాలకులు గాలికి వదిలేశారని మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం నారాయణఖేడ్‌లోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం నియోజకవర్గంలోని భూములను సస్యశ్యామలం చేయడానికి బసవేశ్వర ఎత్తిపోతల పథకానికి రూ.1,774 కోట్లు మంజూరు చేయడమే కాకుండా, భూ సేకరణకు నిధులు పరిహారం సైతం చేపట్టిందన్నారు. తాను ఇటీవల నీటి పారుదలశాఖ అధికారులు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని కలిసి బసవేశ్వర ఎత్తిపోతల పథకం పనులు ప్రారంభించాలని కోరడంతో, అందుకు వారు స్పందించారన్నారు. బోరంచ ఎత్తిపోతల పథకానికి గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం రూ.13 కోట్లు ఖర్చుచేసినా, ఒక ఎకరాకు కూడా నీరు అందించలేదన్నారు. తమ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో కాల్వల నిర్మాణానికి భూములు ఇవ్వకపోవడంతో పాటు, పీవీసీ పైప్‌లైన్ ఏర్పాటు చేసేందుకు రూ.4.30 కోట్లు మంజూరు చేయించామన్నారు. ఈ సమావేశంలో ఖేడ్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ పరశురాం, బీఆర్ఎస్ మనూరు మండలాధ్యక్షుడు విఠల్‌రావు, ఖేడ్‌మాజీ సర్పంచు నజీబ్, మాజీ ఎంపీటీసీ ముజమ్మిల్ పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణం


హోమం నిర్వహిస్తున్న వేద పండితులు

పుల్‌కల్, జూన్ 27: మండలంలోని పెద్దారెడ్డిపేట గ్రామంలో వెలసిన సీతారామచంద్రస్వామి ప్రథమ వార్షికోత్సవాలు గురువారం వైభవంగా జరిగాయి. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించి 108 కలశాలతో లక్ష్మణ సమేత సీతారాములకు అభిషేకం చేసి, లక్ష పుష్పార్చన చేపట్టారు. అనంతరం వేదపండితుల మంత్రోశ్చరణల మధ్య జోగిపేటకు చెందిన శ్యామ్‌ప్రసాద్ దంపతులు హోమం నిర్వహించి, స్వామివారికి కల్యాణం జరిపించారు. మంతూరు, రాయిపాహడ్, సింగూరు, బస్వాపూర్ గ్రామాల భక్తుల తరలివచ్చారు. మంతూరు గ్రామానికి చెందిన దుర్గయ్య భక్తులకు అన్నదానం చేశారు.

అనర్హులను లబ్ధిదారులుగా ఎంపిక చేస్తే చర్యలు: ఎమ్మెల్యే

నారాయణఖేడ్, జూన్ 27: కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారుల ఎంపిక విషయంలో అనర్హులను ఎంపిక చేస్తే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని ఎమ్మెల్యే డాక్టర్‌పట్లోళ్ల సంజీవరెడ్డి హెచ్చరించారు. గురువారం నారాయణఖేడ్‌లోని క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని పలువురు లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేసి మాట్లాడారు. గతంలో 20 ఏళ్లక్రితం పెళ్లిళ్లు జరిగిన వారిని, కర్ణాటక రాష్ట్రానికి చెందిన ఆధార్‌కార్డులతో ఇక్కడి వివరాలు మార్చుకున్న వారిని అర్హులుగా ఎంపిక చేసినట్లు తనకు సమాచారం వచ్చిందన్నారు. ఇలాంటిది మనూరు, నాగల్‌గిద్ద, కంగ్టి మండలాల్లో అధికంగా జరిగినట్లు తెలిసిందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు సుధాకర్‌రెడ్డి, కౌన్సిలర్ వివేకానంద్, సేవాలాల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమేష్ చౌహాన్, మాజీ ఎంపీటీసీ పండరిరెడ్డి, శంకర్ ముదిరాజ్, తదితరులు పాల్గొన్నారు. అనంతరం కంగ్టిలోని చరిత్రాత్మకమైన సిద్ధేశ్వర ఆలయంలో కల్యాణ మండపం నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని ఆలయ కమిటీ చైర్మన్, తదితరులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందించారు. ఈ విషయమై ఉన్నతాధికారులకు నివేదించాలని ఈవోకు ఫోన్ ద్వారా ఆదేశించారు. నారాయణఖేడ్ శివార్లలోని ఎస్టీ మినీ గురుకులంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు.

విద్యార్థుల సస్పెన్షన్ తగదు

● ఎస్ఎఫ్ఐ జహీరాబాద్ డివిజన్ కార్యదర్శి

జహీరాబాద్, జూన్ 27: హైదరాబాద్ యూనివర్సిటీలో విద్యనభ్యసిస్తున్న ఐదుగురు విద్యార్థులను ఆ యూనివర్సిటీ నుంచి సస్పెన్షన్ చేయడం తగదని ఎస్ఎఫ్ఐ నాయకులు పేర్కొన్నారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకత్వం పిలుపు మేరకు విద్యార్థుల సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని కోరుతూ గురువారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జహీరాబాద్ డివిజన్ కార్యదర్శి విష్ణువర్ధన్ మాట్లాడుతూ హైదరాబాద్‌లోని సెంట్రల్ యూనివర్సిటీ వీసీ గెస్ట్‌హౌజ్ ఎదుట ఎస్ఎఫ్ఐ నాయకులు హక్కుల కోసం నిరసన తెలియజేడంతో ఐదుగురిని క్యాంపస్ నుంచి సస్పెన్షన్ చేయడంతో పాటు పోలీసులు కేసులు నమోదు చేయడం పట్ల ఆయన విచారం వ్యక్తం చేశారు. అలాగే విద్యార్థులపై రూ.10వేల జరిమానాలను వేయడమేంటని ఆయన ప్రశ్నిస్తున్నారు. ఐదుగురు విద్యార్థులకు అన్యాయం జరిగితే సహించబోమని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు రఘు, మల్లేష్, బంటి పాల్గొన్నారు.

నారాయణరెడ్డి కుటుంబానికి పరామర్శ

కొండాపూర్, జూన్ 27: గొల్లపల్లి మాజీ పీఏసీఎస్ చైర్మన్ కుటుంబాన్ని గురువారం అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ పరామర్శించారు. గతంలో గొల్లపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘానికి రెండు పర్యాయాలు చైర్మన్‌గా పనిచేసిన పాతూరి నారాయణరెడ్డి కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఈనెల 18న చనిపోయాడు. దశదినకర్మకు హాజరైన స్పీకర్ ప్రసాద్ నారాయణరెడ్డి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

తైబజార్ వేలం పాట వాయిదా

వెల్దుర్తి, జూన్ 27: మండల కేంద్రమైన వెల్దుర్తిలో నూతనంగా ప్రారంభించనున్న మేక, గొర్రెల సంత తైబజార్ వేల పాట వాయిదా పండింది. సంత నిర్వహణ కోసం తైబజార్ వేలం పాటను గురువారం గ్రామపంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేశారు. ధర రూ.లక్ష నిర్ణయించగా.. ధర ఎక్కువగా ఉండడంతో వేలం పాటకు ఎవరూ హాజరుకాలేదు. వచ్చేనెల 3న వేలం నిర్వహిస్తామని ఈవో బలరాంరెడ్డి పాల్గొన్నారు.

'చైతన్య'లో ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీ

పటాన్‌చెరు రూరల్, జూన్ 27: రుద్రారం చైతన్య కళాశాల క్యాంపస్‌లో ఫుడ్ సేఫ్టీ అధికారులు గురువారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఫుడ్ సేఫ్టీ ఇన్‌స్పెక్టర్ ధర్మేందర్ క్యాంపస్‌లోని వంటగదిలో పరిశుభ్రత లోపించడం, ఆర్వో మంచినీటి ప్లాంట్, వంటశాలలో నిర్వాహకులకు సరైన శిక్షణ లేకపోవడం, ఆహార పదార్థాలపై నాణ్యతకు సంబంధించిన వివరాలు లేకపోవడం తదితర అంశాలను గమనించారు.